RNI No. APTEL/2008/23088

# తెలంగాణ పత్రిక

TELANGANA PATRIKA
TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

నిజం మా విజన్

Epaper.Telanganapatrika.in

తెలంగాణ తల్లి

తెలంగాణ పత్రిక
TELANGANA PATRIKA TELUGU DAILY
నిజం మా విజన్
18వ వసంతంలోకి

EDITOR :Boorla Venkatesham KARIMNAGAR VOLUME:17 ISSUE:363 THURSDAY ,APRIL ,30,2026 PAGES:20 COST: 5 /-

ఎడిటర్ : బూర్ల వెంకటేశం కరీంనగర్ సంపుటి :17 సంచిక :363 గురువారం, ఏప్రిల్ 30, 2026, పేజీలు -20 వెల :5/-

CIRCULATED BY : ADILABAD, ASIFABAD, BHADRADRI KOTHAGUDEM, HYDERABAD, JAGITYAL, JAYASHANKER, JOGULAMBA, KAMAREDDY, KHAMMAM, MAHABUBABAD, MAHABOOBNAGAR, MANCHIRYAL, MEDCHAL, MALKAJGIRI, NAGARKARNOOL, NALGONDA, NIRMAL, NIJAMABAD, RAJANNA SIRCILLA, RANGAREDDY, SANGA REDDY, SIDDIPET, SURYAPET, VIKARABAD, WANAPARTHY, WARANGAL (RURAL), WARANGAL (URBAN), YADADRI

## రిటైర్డ్ ఉద్యోగులకు తీపి కబురు
## ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ



తెలంగాణ పత్రిక ప్రతినిధి

ఇటీవల కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిల పై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తొలివిడతలో బుధవారం వేయికోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల - మిగతా2లో

# సిఎం రేవంత్‌తో కొత్త డిజిపి ఆనంద్ భేటీ

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణ లో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం, పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాల పై సీఎం ఈ సందర్భంగా - మిగతా2లో



## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల




తెలంగాణ పత్రిక ప్రతినిధి

తెలంగాణ పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 95.1 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. - మిగతా2లో

## ప్రాణహిత పై వెనక్కి తగ్గేది లేదు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. మంత్రి బుధవారం మీడియాతో - మిగతా2లో



## మేము చేయని ప్రజా పోరాటం లేదు

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రాష్ట్రంలో టీజేఎస్ పాల్గొనని ప్రజా పోరాటాలు లేవని ఎమ్మెల్సీ కోదండ రాం అన్నారు. టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవంలో ఆ పార్టీ అధ్యక్షుడు కోదండరాం పాల్గొన్నారు. రాజకీయా వ్యూహాల్లో భాగంగానే కాంగ్రెస్‌కు మద్దతిచ్చాం. మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ - మిగతా2లో



## రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ

తెలంగాణ పత్రిక ప్రతినిధి

రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతాధి కారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాల పై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. - మిగతా2లో



## అధికారం రావడం పోవడం రొటీన్ వ్యవహారం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

అధికారం రావడం పోవడం రొటీన్‌గా జరిగే తంతు అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ ,మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి. ప్రజల స్థితిగతులు మారుతున్నాయా లేదా అని ఆలోచించడం లేదని తెలిపారు. బుధవారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన జాయినింగ్ కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. అధికారం తమకు కొత్తేం కాదని వెల్లడించారు. మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు.తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం - మిగతా2లో



## దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

తెలంగాణ పత్రిక ప్రతినిధి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేతుల మీదుగా నిజామాబాద్ జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. బుధవారం ఉదయం నిజామాబాద్‌లో నూతన కాంగ్రెస్ కార్యాలయ భవనానికి మహేశ్ గౌడ్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి - మిగతా2లో



## మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

తెలంగాణ పత్రిక ప్రతినిధి

బ్రిటిష్ వారు లేకపోతే అమెరికా ప్రజలు ఫ్రెంచ్ మాట్లాడాల్సి వచ్చేదంటూ బ్రిటన్‌రాజు ఛార్లెస్ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను ఎద్దేవా చేస్తూ చురకలు అంటించారు. మంగళ వారం రాత్రి అధ్యక్ష కార్యాలయంలో జరిగిన స్టేట్ డిన్నర్‌లో - మిగతా2లో



## తండ్రికి విలువ ఇవ్వని కవిత అమ్మ ఎలా అవుతుంది

తెలంగాణ పత్రిక ప్రతినిధి

తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందని ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి కవితను ఉద్దేశించి ప్రశ్నించారు. తన అన్న మీద ఉన్న కోపాన్ని తండ్రి మీద చూపడం తప్పన్నారు. ఈ మేరకు టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత పై ఎమ్మెల్యే కోమటి రెడ్డి - మిగతా2లో



## తెలంగాణ టెన్త్ ఫలితాలు విడుదల

-మొదటిపేజీ తరువాయి

ఈ ఏడాది 5 లక్షల 28 వేలకు పైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు. టెన్త్ ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 94.07 శాతం ఉత్తీర్ణత పొందారు. 5,731 స్కూళ్లలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవగా.. 6 పాఠశాలల్లో సున్నా శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు విద్యాశాఖ వెల్లడించింది. పదో తరగతి ఫలితాలను 8096958096 అనే మీ సేవా వాట్సాప్ ద్వారా తెలుసుకోవచ్చు. మీ సేవా వాట్సాప్ నెంబర్‌కు విద్యార్థులు హాయ్ అని మెసేజ్ టైప్ చేయాలి. తర్వాత ఎస్ఎస్సి రిజల్ట్స్ అని టైప్ చేసి హాల్ టికెట్ నెంబర్‌ను ఎంటర్ చేస్తే ఫలితాలను చూడొచ్చు. ఇకపోతే సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మీడియం విద్యార్థుల్లో 89.14 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఇంగ్లీష్ మీడియం విద్యార్థుల్లో 95.86 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. ఉర్దూ మీడియం విద్యార్థుల్లో 86.71 శాతం నమోదయ్యింది. ములుగు జిల్లాలో అత్యధికంగా 99.30 శాతం ఉత్తీర్ణత సాధించారు. హైదరాబాద్ జిల్లాలో అత్యల్పంగా 89.23 శాతం ఉత్తీర్ణత నమోదయ్యింది. గ్రేడ్స్ మాత్రమే కాకుండా స్జబెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు.

## ప్రాణహిత పై వెనక్కి తగ్గేది లేదు

-మొదటిపేజీ తరువాయి

తుమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లికి ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను పరిశీలిస్తున్నామని తెలిపారు. ఆర్వీ అసోసియేట్స్, ఐఐటీ హైదరాబాద్ సమిష్టిగా నాలుగు ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెచ్చారని వివరించారు. ప్రతీ ప్రతిపాదనకు అయ్యే ఖర్చు, అనుకూల, ప్రతీ కూలతలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో జరగనున్న సమీక్షా సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు. మెడిగడ్డ, సుందిళ్ల, అన్నారం పునరుద్ధరణకు అవసరమైన పరీక్షలను వర్షాకాలం లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రతీ 1.5 మీటర్ల దూరంలో ఎస్పీటీ టెస్ట్‌లు నిర్వహించాలి. ప్రతీ మూడు మీటర్ల దూరంలో పెర్మిబిలిటీ టెస్ట్‌లు జరపాలి. బోర్లు వేస్తున్న సమయంలో రాయి వచ్చినప్పటికీ రాయి లోపటికి 5 మీటర్లు లోతుగా బోర్లు వెయ్యాలి. బ్యారేజ్ ల పునరుద్ధరణ కోసం నియమించిన సమన్వయ కమిటీ బ్యారేజ్‌లను సందర్శించి టైంలైన్‌ను ఫిక్స్ చేసుకోవాలి. అచిఖఖా డైరెక్టర్ క్షేత్ర స్థాయిలో ఉంటూ పునరుద్ధరణకు అవసరమైన పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలి.

## మేము చేయని ప్రజా పోరాటం లేదు

-మొదటిపేజీ తరువాయి

మంత్రులం, ఎమ్మెల్యేలం కావాలని మాకు లేదు. మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు.. నేను అడగలేదు. అవసరమైనప్పుడు ప్రజలకు తోడుగా ఉన్నాం. మే 12న జరిగే ప్లీనరీలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం అని అన్నారు. 'మేము ప్రభుత్వ పదవులు, నామినేటెడ్ పోస్టులు కావాలని అడుగుతున్నాం. ఈసారి మా పార్టీ నేతలకు నామినేటెడ్ పోస్టులు ఇస్తారని నమ్ముతున్నాం' అని అన్నారు. 'గత ప్రభుత్వంలో ఎవరినైనా కలవాలంటే భయపడే పరిస్థితి ఉండేది. ఇంట్లోనే ఫోన్ పెట్టి, జాగ్రత్తగా రమ్మని చెప్పేవాళ్లు. భయం అంటే ఏంటో గత ప్రభుత్వం చూపించింది' అని విమర్శించారు. అమరుల స్ఫూర్తి యాత్రకు కూడా పర్మిషన్ ఇవ్వలేదని కోదండరాం గుర్తు చేశారు. ప్రజల నుంచి దూరంగా ఉంటే ఏ పార్టీ అయినా బతకదని, అందుకే కేసీఆర్ ఇప్పుడు బయటకు వస్తున్నారని అన్నారు. 'మేం సరిగ్గానే ఉన్నాం. ప్రజలే మారాలని కేసీఆర్ ఆలోచిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. కుటుంబ లోపాలను కవిత బయటపెడుతున్నారని అన్నారు. పార్టీ అంటే కుటుంబమే అని కవిత చెప్పకుండానే చెబుతున్నట్లు ఉందని అన్నారు. ఓట్లు, సీట్లు కావాలంటే పార్టీని వేరేలా నడపాలని.. తాము మార్పు కోసమే పార్టీని నడుపుతున్నామని స్పష్టం చేశారు. ముందు నుంచే నియోజక వర్గాలను ఎంచుకుని పని చేస్తామన్నారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు కోదండరాం తెలిపారు.

## మేమే లేకపోతే మీరు ఫ్రెంచ్ మాట్లాడిల్సి వచ్చేది

-మొదటిపేజీ తరువాయి

రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా సహాయం చేయకపోతే యూరోపియన్ దేశాల ప్రజలు జర్మన్, జపనీస్ మాట్లాడేవారని ట్రంప్ గతంలో అన్న మాటలను బ్రిటన్ రాజు గుర్తుచేశారు. 'అధ్యక్షా.. అమెరికా లేకపోతే యూరోపియన్ దేశాలు జర్మన్ మాట్లాడేవని మీరు ఇటీవల వ్యాఖ్యానించారు. నేనేం చెబుతున్నానంటే ఒకవేళ మేము లేకపోతే, మీరు ఫ్రెంచ్ మాట్లాడేవారు' అని చార్లెస్ చమత్కరించారు. 250 ఏళ్ల క్రితం అమెరికాకు స్వాతంత్య్రం రాకముందు.. ఈ దేశంపై పట్టు కోసం బ్రిటన్, ఫ్రాన్స్ చేసిన ప్రయత్నం గురించి ఆయన ప్రస్తావించారు. లండన్-వాషింగ్టన్ మధ్య ఉన్న ప్రత్యేక సంబంధాన్ని కొనియాడారు. అనంతరం ట్రంప్ మాట్లాడుతూ.. స్టేట్ డిన్నర్‌లో అద్భుతమైన ప్రసంగం చేసినందుకు బ్రిటన్ రాజును అభినందించారు. ఇరాన్‌తో యుద్ధం విషయంలో తమకు మద్దతిచ్చేందుకు ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ ముందుకు రాకపోవడాన్ని విమర్శించారు.

## దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్‌దే విజయం

-మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని పదవిని కూడా రాహుల్ గాంధీ త్యాగం చేశారని.. దేశం మొత్తం ఆయనవైపు చూస్తోందన్నారు. దేశంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ.. కుల, మతాల చిచ్చు రేపుతోందని మహేశ్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు రావటం ఖాయమన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని తెలిపారు. కేసీఆర్ పాలన తెలంగాణను 50 ఏళ్లు వెనక్కి తీసుకెళ్లిందని మహేశ్ విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మరో పార్టీ పోటీ లేదన్నారు. మంచి నమూనాతో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనక్కి తగ్గేది లేదని మహేశ్ కుమార్ స్పష్టం చేశారు. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ పార్టీ ఎంతో అభివృద్ధి చేసిందని.. ఏడాది కాలంలో 4 లక్షల ఇండ్లు కట్టించి ఇచ్చామని మంత్రి సీతక్క వెల్లడించారు.

# సీఎం రేవంత్ తో కొత్త డిజిపి ఆనంద్ భేటీ

-మొదటిపేజీ తరువాయి

తెలంగాణ నూతన డీజీపీగా నియమితులైన సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో భేటీ అయ్యారు. రాష్ట్ర శాంతిభద్రతల పరిరక్షణలో తనపై నమ్మకం ఉంచి డీజీపీగా బాధ్యతలు అప్పగించినందుకు సీఎంకు ఈ సందర్భంగా సీవీ ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రంలో నేరాల నియంత్రణ, డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యం,పోలీస్ వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే అంశాలపై సీఎం ఈ సందర్భంగా పలు సూచనలు చేసినట్లు సమాచారం. గతంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సమర్థవంతంగా పనిచేసిన అనుభవం ఉన్న సీవీ ఆనంద్, ఇప్పుడు రాష్ట్ర పోలీస్ బాస్ గా పగ్గాలు చేపట్టడంతో పోలీస్ శాఖలో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది.సీఎం రేవంత్ రెడ్డి సీవీ ఆనంద్‌కు శుభాకాంక్షలు తెలుపారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా విధులు నిర్వహించాలని సూచించారు. సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ (1991 బ్యాచ్)ను డీజీపీగా నియమిస్తూ సీఎస్ కే.రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత డీజీపీ బి.శివధర్‌రెడ్డి ఏప్రిల్30న పదవీవిరమణ పొందనున్నారు. ఈ క్రమంలోనే మే 1న సీవీ ఆనంద్ నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించనున్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారుల్లో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ ఐపీఎస్ అధికారి. ఇటీవలే యూపీఎస్సీ డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్‌ల జాబితాను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం పంపిన విషయం తెలిసిందే. అందులో సీవీ ఆనంద్‌తోపాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యామిశ్రా పేర్లు ఉన్నాయి. అయితే ఈ ముగ్గురిలో సీవీ ఆనంద్ అత్యంత సీనియర్ కావడంతో డీజీపీ హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్(-హెచ్‌ఓపీఎఫ్)గా నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి డీజీపీలు నియమితులైన అందరూ తొలుత ఇంచార్జి డీజీపీగాలు బాధ్యతలు నిర్వహించగా.. సీవీఆనంద్ మాత్రం పూర్తిస్థాయి డీజీపీగా నియమితులు కావడం గమనార్హం. డీజీపీగా 2028 జూన్ వరకు సీవీ ఆనంద్ కొనసాగనున్నారు.

# రిటైర్డ్ ఉద్యోగులకు తీపి కబురు

-మొదటిపేజీ తరువాయి

ఇటీవల కేబినేట్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు తెలంగాణ రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా తొలివిడతలో బుధవారం వేయికోట్లను ఆర్థికశాఖ విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టమైన ఆదేశాల మేరకు, ఉద్యోగుల పెండింగ్ బకాయిల కోసం రూ. 1000 కోట్ల నిధులను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా ఈ మేరకు నిధుల విడుదల చేయటం జరిగింది. గత ఏడాది ఉద్యోగ సంఘాలతో జరిగిన చర్చల సందర్భంగా ప్రభుత్వం నెలకు రూ. 700 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చింది. ఆ ప్రకారంగా మార్చి 2026 వరకు ప్రతినెల ఉద్యోగులకు ఇచ్చిన మాటను ప్రభుత్వం అమలు చేసింది. అయితే, ఉద్యోగుల ఆర్థిక అవసరాలను, వారు పడుతున్న ఇబ్బందులను స్వయంగా గమనించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ఆ మొత్తాన్ని రూ. 1000 కోట్లకు పెంచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఏప్రిల్ నెలకు సంబంధించిన వెయ్యి కోట్ల రూపాయలను యుద్ధ ప్రాతిపదికన విడుదల చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను సర్కార్ చెల్లించింది. దీంతో 2025 అక్టోబర్ వరకు బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసింది. గతంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు ఇప్పటివరకు ప్రతి నెల ఉద్యోగుల బకాయిల కోసం ప్రభుత్వం రూ.700 కోట్ల చొప్పున చెల్లిస్తూ వస్తోంది. ఏప్రిల్ బకాయిల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచింది. మిగిలిన ఉద్యోగులకు సంబంధించి త్వరలోనే నెలకు వెయ్యి కోట్ల చెప్పున విడుదల చేస్తూ బకాయిలన్నింటీని క్లియర్ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఉద్యోగుల మెడికల్ బిల్లులను కూడా ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా ప్రభుత్వం చెల్లిస్తోంది. అక్టోబర్ 2025 వరకు పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలన్నింటినీ ఈ నిధులతో పూర్తిగా క్లియర్ చేశారు. తమ పదవీ విరమణ ప్రయోజనాల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది సీనియర్ సిటిజన్లకు ఇది గొప్ప ఊరటనిచ్చే అంశం. ఉద్యోగుల ఆరోగ్య అవసరాలకు సంబంధించి మెడికల్ బిల్లులను ఒక్క రోజు కూడా ఆలస్యం చేయకుండా, ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు చెల్లించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రస్తుతం మెడికల్ బిల్లుల చెల్లింపులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఉద్యోగుల ఆరోగ్య భద్రత విషయంలో రాజీ పడకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్క రోజు కూడా జాప్యం లేకుండా మెడికల్ బిల్లుల చెల్లింపులు రెగ్యులర్ గా జరిగేలా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఉపముఖ్యమంత్రి చొరవతో పెద్ద మొత్తంలో నిధులు విడుదల కావడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

# రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త కళ తీసుకురావాలని ఉన్నతాధి కారులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన పర్యాటక మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక రంగానికి కొత్త శోభను తీసుకొచ్చేందుకు పలు అంశాల పై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చించారు. హైదరాబాద్‌లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ ఏడాది చివరిలో నవంబర్ లేదా డిసెంబర్‌లో వీటిని నిర్వహించేందుకు ప్లాన్ చేయాలని సూచించారు. రాష్ట్రంలోని కీలక పర్యాటక కేంద్రాల్లో వారాంతంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు. సోమశిల, రామప్ప, యాదాద్రి ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గోల్కొండ, తారామతి బరాదరిలలో జరుగుతున్న పనులపై ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్షించారు. పర్యాటక ప్రాంతాల్లో కనీస సౌకర్యాల ఏర్పాట్లపై రాజీ లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. మరుగుదొడ్లు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి స్పష్టం చేశారు. రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలు అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ప్రతి టూరిజం ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారులను నియమించాలన్నారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ సమన్వయంతో నగరాన్ని సుందరీకరిస్తామని తెలిపారు. స్కైవాక్‌లు, శిల్పాలతో హైదరాబాద్‌కు కొత్త ఆకర్షణ తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామని చెప్పారు.తెలంగాణను వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి జూపల్లి పేర్కొన్నారు. మెడికల్, వెల్నెస్, గోల్ఫ్, ఫిలిం టూరిజంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మధ్య ప్రాచ్య దేశాల్లో తెలంగాణ టూరిజంపై ప్రచారం నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. చైనా, వియత్నాం టూరిజం మోడళ్ల గురించి అధ్యయన యాత్రలపై ప్రతిపాదనలు వచ్చాయని తెలిపారు. వరంగల్, సోమశిలలో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్ల ప్రతిపాదనలు వచ్చాయని మంత్రి జూపల్లి చెప్పారు. రామప్ప దేవాలయం వరకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాజెక్టులకు నిర్దిష్ట కాలపరిమితితో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు.

## అధికారం రావడం..పోవడం రొటీన్ వ్యవహారం

-మొదటిపేజీ తరువాయి

మొన్ననే తమ పార్టీ ఏర్పడి 25 ఏళ్లు పూర్తిచేసుకుందని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల్లో తెలుగుదేశం పార్టీతోపాటు బీఆర్ఎస్ మాత్రమే నిలబడ్డాయని చెప్పారు. అధికారంలోకి రాకుంటే కొంపలు అంటుకుపోతాయి అనుకోవద్దని నేతలకు సూచించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ చిలుకకు చెప్పినట్టు చెప్పారని.. తొందరపడకండి ఆగమై ఓటు వేయకండి అని కేసీఆర్ కల్వకుర్తిలో చెప్పిన మాటలను గుర్తు చేశారు. కేసీఆర్ రైతుబంధు ఇచ్చే సమయంలో ఆయన ఇంట్లో నుంచి ఇస్తున్నారా? అని ప్రశ్నించారు.. పెద్ద రైతులకు ఎందుకు ఇస్తున్నారు అంటూ అడిగారన్నారు. ఎన్ని విమర్శలు వచ్చినా రైతుబంధు మాత్రం కేసీఆర్ ఆపకుండా ఇచ్చేవారని తెలిపారు. ఇప్పుడు పరిస్థితి ఎలా ఉందో చూడాలని ప్రజలకు సూచించారు. చాలా నియోజక వర్గాల్లో కేసీఆర్ గెలిస్తే చాలు ఈ ఎమ్మెల్యే మాకొద్దు అనుకుని తమ ఎమ్మెల్యేలను ఓడగొట్టారని కేటీఆర్ అన్నారు. అలా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని తెలిపారు. తర్వాత మనకు చాలా షాక్‌లు తగిలాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఆ తర్వాత కేసీఆర్‌కి రెండోసారి ఫ్రాక్చర్ జరిగింది. మన పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ మారి వెళ్లిపోయారు. ఇక రేవంత్ రెడ్డి మీద నాకు గెట్టు పంచాయతీ లేదు. ఇంకా వేరే గొడవ ఏమీ లేదు. కానీ ఇష్టం వచ్చినట్లు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వాళ్లు జనాలను మోసం చేశారు. అన్న వస్త్రానికి పోతే ఉన్న వస్త్రం పోతుందని కేసీఆర్ చెప్పారు. కానీ మనం వినలేదు. ఎన్నికల ముందు కల్వకుర్తిలో సర్వే చేయించాం. మన ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఓడిపోతాడని క్లియర్‌గా చెప్పారు. పదేళ్లు అధికారంలో ఉన్నారు కాబట్టి అధికార మార్పిడి కావాలని చాలా మంది జనాలు భావించారని కేటీఆర్ వివరించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను ఓడగొట్టడం వల్లే కేసీఆర్ సీఎం కాలేకపోయారని కేటీఆర్ వెల్లడించారు.

## తండ్రికి విలువ ఇవ్వని కవిత అమ్మ ఎలా అవుతుంది

-మొదటిపేజీ తరువాయి

కూతురికి తండ్రి అంటే ప్రేమ ఉండాలని.. కానీ కవిత తన మొదటి సమావేశంలో తండ్రిని తిట్టి మర్యాద పోగొట్టుకున్నారని అన్నారు. ఉద్యమకారుడు కేసీఆర్‌ను తిట్టడం తనకు బాధేసిందని తెలిపారు. మద్యం కుంభకోణంలో కవితకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని.. కేసు పూర్తి కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. డబ్బులు ఉన్నాయని పార్టీ పెట్టడమంటే పాన్ షాప్ పెట్టేంత సులువైందన్నారు. మంత్రి పదవిపై అధిష్ఠానం తనకు హామీ ఇచ్చిందని... మాట నిలబెట్టుకుంటుందనే నమ్మకం ఉందన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత కేబినెట్ విస్తరణ ఉండొచ్చని తెలిపారు. మంత్రి పదవి ఇస్తే మరింత కష్టపడి పనిచేస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కవిత ఇటీవల చేసిన వ్యాఖ్యలు, రాజకీయ చర్యలపై స్పందిస్తూ ఆయన పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కవిత పార్టీ ఏర్పాటు విషయాన్ని రాజగోపాల్ రెడ్డి 'బిగ్ జోక్'గా అభివర్ణించారు. అదే విధంగా టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెట్టడం మరో జోక్ అని వ్యాఖ్యానించారు. కవితకు ఉన్న గుర్తింపు కేవలం ఒక ఉద్యమకారుడు బిడ్డగా మాత్రమేనని, ఆమె స్వతంత్ర రాజకీయ నాయకత్వం ఇంకా నిరూపించుకోలేదని అన్నారు. మొదటి సమావేశంలోనే తన తండ్రి అయిన కేసీఆర్‌ను విమర్శించడం సరైంది కాదని రాజగోపాల్ రెడ్డి అభిప్రాయపడ్డారు. తండ్రిపై గౌరవం, ప్రేమ ఉండాలని, అలాంటి విలువలు లేకపోతే ఆమె వ్యక్తిత్వం ప్రశ్నార్థకమవుతుందని ఆయన వ్యాఖ్యానించారు. తండ్రికి విలువ ఇవ్వని మనిషి అమ్మ ఎలా అవుతుందిఅంటూ ఆయన తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే కవిత అన్నపై ఉన్న కోపాన్ని తండ్రిపై చూపడం సరికాదని అన్నారు. కుటుంబ సమస్యలను రాజకీయ వేదికపైకి తీసుకురావడం సరైన పద్ధతి కాదని ఆయన సూచించారు. కవితపై ఉన్న మద్యం కుంభకోణం ఆరోపణల విషయమై.. ఆమెకు ఇంకా క్లీన్ చిట్ రాలేదని, నిర్దోషి అని తేలలేదని రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

# ఫిన్లాండ్ విద్యలో హోంవర్క్ లేదు.. ఒత్తిడి ఉండదు

-9 వ తరగతి వరకు పరీక్షలు లేనే లేవు
-ఆరేళ్లు నిండిన తర్వాతే అడ్మిషన్లు
-బోధన నైపుణ్యాలుంటేనే టీచరు పోస్టు
-ఫిన్లాండ్‌లో తెలంగాణ టీచర్లు గుర్తించిన అంశాలివీ..
-వీణవంక ఎంఈఓ సుద్దాల శోభారాణి..

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక).

ఫిన్లాండ్‌లో విద్యార్థులకు హోం వర్క్‌లు ఉండవు.. ఒత్తిడి ఎరుగరు.. పరీక్షల భయమే లేదు.. అందుకే ఇది ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యావిధానంగా పేరుగాంచింది. తెలంగాణ విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలని తరచూ పేర్కొనే సీఎం రేవంత్ రెడ్డి.. ఇక్కడి ఉపాధ్యాయులను క్షేత్ర స్థాయి పర్యటన కోసం ఫిన్లాండ్ పంపారు. 24 మంది ఉపాధ్యాయులు, ఆరుగురు విద్యాశాఖ ఉన్నతాధికారులు కలిపి మొత్తం 40మంది ఐదు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 20న అక్కడికి చేరుకున్నారు. విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా నేతృత్వంలో వెళ్లిన బృందం నాలుగు రోజుల్లో వివిధ ప్రాంతాల్లోని పాఠశాలలను సందర్శించింది. అక్కడి అధికారులతో సమావేశమైంది. ఈ నేపథ్యంలో ఫిన్లాండ్ విద్యావిధానంలో తెలంగాణ ప్రతినిధుల బృందం పలు కీలక అంశాలను గుర్తించింది.



పాఠాలతోపాటు జీవన నైపుణ్యాలు,ప్రపంచంలో అత్యుత్తమ విద్యా వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన దేశం ఫిన్లాండ్. కేవలం పాఠ్యాంశాల బోధనకే పరిమితం కాకుండా, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించడం అక్కడి ప్రత్యేకత. ఫిన్లాండ్‌లో పాఠ్య ప్రణాళిక ఎంతో సరళంగా, జీవన నైపుణ్యాలను పెంపొందించే విధంగా రూపొందించారు. విద్యార్థులు పాఠశాలకు రావడాన్ని ఆనందంగా భావిస్తూ, వివిధ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటారు. అక్కడి ఉపాధ్యాయులు అత్యంత అర్హత కలిగినవారు. భారత్‌లో యూపీఎస్సీ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షల తరహాలో అక్కడ ఉపాధ్యాయుల ఎంపిక విధానం ఉంటుంది. ప్రాథమిక పాఠశాల టీచర్ కావాలన్నా.. మాస్టర్స్ డిగ్రీతో పాటు బోధన కొనసాగుతుందని అన్నారు.

# డ్రగ్స్ నిర్మూలన,మహిళల పిల్లల భద్రత అందరి బాధ్యత

-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్.

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ,ఈగిల్ టీమ్ ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలన ,వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా చైల్డ్ సేఫ్టీ, సే నో టు డ్రగ్స్ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 5వ అంశమైన పిల్లల భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో పోలీసు సిబ్బంది ప్రత్యక్షంగా వెళ్లి డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితమే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం పడుతుందని, యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకునే ప్రమాదం ఉందని అన్నారు.గంజాయి సరఫరా, వినియోగంపై ఇప్పటికే పోలీస్ శాఖ కఠిన నిఘా ఉంచిందని, గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. డ్రగ్స్ వినియోగించే వ్యక్తులకు కౌన్సిలింగ్ నిర్వహించడం ద్వారా వారిని సరికొత్త మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తున్నామని



పేర్కొన్నారు.మహిళలు, పిల్లల భద్రత విషయంలో ఎటువంటి రాజీ ఉండదని, వారి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

# లైసెన్స్ లేకుండా గల్ఫ్ ఏజెంట్ల దందా పోలీసుల చర్య ఎప్పుడు...

-జగిత్యాలలో అక్రమ గల్ఫ్ ఆఫీసుల పెరుగుదల
-అమాయక యువతను లక్ష్యంగా చేసుకున్న మోసగాళ్లు
-బైపాస్ రోడ్, పాత ధర్మపురి రోడ్, ఎస్ కే ఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్ ఏరియాలో విచ్చలవిడిగా కార్యాలయాలు.
-గల్ఫ్ కలలు... మోసాల బంధం...!

జగిత్యాల పట్టణం,తెలంగాణ పత్రిక,ఏప్రిల్ 29.

జగిత్యాల పట్టణం లో గల్ఫ్ ఉద్యోగాల పేరుతో అమాయక యువతను మోసం చేసే ఘటనలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. జగిత్యాల పట్టణంలోని మిషన్ కాంపౌండ్ ఏరియా నుండి రాజీవ్ గాంధీ చౌరస్తా వరకు మాత్రమే కాకుండా, బైపాస్ రోడ్, పాత ధర్మపురి రోడ్, ఎస్ కే ఎస్ ఆర్ డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో కూడా అనేక మంది గల్ఫ్ ఏజెంట్లు ఎలాంటి అధికారిక లైసెన్సులు లేకుండా కార్యాలయాలు నిర్వహిస్తున్నారు. వారు షట్టర్లు కిరాయికి తీసుకుని బయటకు ఆకర్షణీయమైన బోర్డులు పెట్టి, లోపల యువతకు విదేశీ ఉద్యోగాల పేరుతో భారీ జీతాలు వస్తాయని తప్పుడు హామీలు ఇస్తున్నారు.ఈ క్రమంలో అమాయక యువత నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి,తర్వాత వారిని మోసం చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గల్ఫ్ ఉద్యోగం పేరుతో మా దగ్గర నుంచి డబ్బులు తీసుకుని మోసం చేశారు. మాకు న్యాయం చేయాలి అని బాధిత యువకులు కోరుతున్నారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాల వల్ల యువత భవిష్యత్తు ప్రమాదంలో పడుతోందని, వెంటనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి మోసగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని అలాగే అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటే మాత్రమే




జగిత్యాలలో జరుగుతున్న గల్ఫ్ మోసాలకు చెక్ పడే అవకాశం ఉందని ప్రజలు భావిస్తున్నారు.

# మల్లూరు క్షేత్రంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు



-ధ్వజారోహణంతో పునీతమైన పుణ్యధామం

మంగపేట ఏప్రిల్ 29(తెలంగాణ పత్రిక)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనృసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజైన బుధవారం ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలను ఆగమ శాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు వేణుగోపాల స్వామి వారికి స్నపన తిరుమంజనం వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని పూర్తి చేసి, బ్రహ్మోత్సవాలకు ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ మహోత్సవాన్ని భద్రాచలం సీతారామచంద్రస్వామి వారి దేవస్థాన అర్చకులు అమరవాది మురళీకృష్ణామాచార్యుల బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. వేద మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఆవిష్కరించి ముక్కోటి దేవతలను ఉత్సవానికి ఆహ్వానించారు. సాయంత్రం 6 గంటల నుండి దేవతా హ్వానం, భేరి పూజ తదితర కార్యక్రమాలను భక్తిభావంతో పూర్తి చేశారు. ఈ వేడుకల్లో దేవస్థానం కార్యనిర్వహణాధికారి యం. వీరస్వామి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సురేష్, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. స్వామివారి వార్షిక ఉత్సవాలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో




తరలిరావడంతో మల్లూరు పుణ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లుతోంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

## 108 అంబులెన్స్‌లోనే కాన్పు: మగబిడ్డకు జన్మ

ఇల్లంతకుంట, ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక



పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని ఆసుపత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగింది. ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూరు గ్రామానికి చెందిన పూజ భవాని బుధవారం పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఈఎంటీ రాజశేఖర్, పైలట్ దినేష్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని ఆమెను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ప్రసవం జరిగింది. భవాని పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, మెరుగైన వైద్యం కోసం ఇద్దరినీ వేములవాడ ఆసుపత్రికి తరలించినట్లు ఈఎంటీ రాజశేఖర్, పైలట్ దినేష్, ఆశ వర్కర్ తెలిపారు.

## వీణవంక లో తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

-హర్షం వ్యక్తం చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 29( తెలంగాణ పత్రిక).



తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ నియోజకవర్గాల వారీగా మంజూరిలో భాగంగా వీణవంక మండలానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు చేయబడినదని మండల విద్యాధికారిణి ఎస్ శోభారాణి తెలియ చేసినారు ఈ పాఠశాలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వీణవంక నందు ఏర్పాటు చేయుటకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా బుధవారం భువనగిరి జిల్లాలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను సందర్శించుటకు వీణవంక జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అశోక్ రెడ్డి ని పంపించడం జరిగిందని మండల విద్యాధికారిణి ఓ ప్రకటనలో తెలియజేశారు.

## రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.

జగిత్యాల రూరల్ (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29



జగిత్యాల రూరల్ మండలం లోని చల్ గల్, తాటిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా, వేగంగా కొనుగోలు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ పరిస్థితిని, తూకం విధానాన్ని, 17 శాతం తేమ నిర్వహణను,కేంద్రల వద్ద వసతులను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యంపై ప్రభుత్వ నిబంధనల మేరకు తేమశాతం తప్పనిసరిగా పరిశీలించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్ళు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా తక్షణమే రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాల నిర్వహణ, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, త్రాగునీరు, షేడ్ నెట్ ల ఏర్పాటు, ధాన్యం కొనుగోళ్ళు వంటి అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అలాగే వాతావరణం మార్పుల దృష్ట్యా టార్పలిన్ కవర్ లు అందుబాటులో ఉంచుకోవాలని అన్నారు.ఈ పరిశీలనలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, డిఆర్డిఓ రఘువరన్, ఎమ్మార్వో, ఎంపీడీవో, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా జ్యోతి లక్ష్మణ్ ఎన్నిక

జగిత్యాల పట్టణం (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29



జగిత్యాల జిల్లా లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ మాజీ చైర్మన్ లయన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఎన్నిక కావడం సందర్భంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాజ సేవలో సుదీర్ఘ అనుభవం కలిగిన ఆమె ఈ బాధ్యతలు చేపట్టడం క్లబ్ కార్యకలాపాలకు కొత్త దిశను తీసుకువస్తుందని పలువురు పేర్కొన్నారు. ప్రజలకు చేరువగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించగల సామర్థ్యం ఆమెకు ఉందని తెలిపారు.ఈ సందర్భంగా వివిధ వర్గాల ప్రతినిధులు, నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేస్తారని నమ్మకం వ్యక్తం చేశారు.

## దేవగిరిపట్నం మైనారిటీ గురుకుల పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో వందశాతం విజయం

ఆత్మకూర్ : ఏప్రిల్ 29 (తెలంగాణ పత్రిక):



ములుగు మండలంలోని దేవగిరిపట్నం మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల పదో తరగతి ఫలితాల్లో శాతం 100 ఉత్తీర్ణత సాధించి ప్రతిభ చాటింది. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాల నుంచి మొత్తం 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణులై వందశాతం ఫలితాన్ని నమోదు చేశారు. వీరిలో 37 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించడం విశేషంగా నిలిచింది. మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థుల్లో ఎం. సాత్విక 566 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. కే. నిఖిత శ్రీ 554 మార్కులు, ఎం.డి. నిషా బేగం 553 మార్కులు, వి. హాసిని 552 మార్కులు, ఎం. తేజశ్రీ మరియు కే. అస్మిత ఇద్దరూ 550 మార్కులు, టి. సాయి ప్రియ 546 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీలతతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల సాధించిన ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేశారు.

## ఫ్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

-జమ్మికుంట మార్కెట్ డైరెక్టర్ నల్లగొని సతీష్..

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 29( తెలంగాణ పత్రిక).



వీణవంక మండలం ఎల్బాక, కొండపాక గ్రామాలలో ఫ్యాక్స్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట మార్కెట్ డైరెక్టర్ నల్లగొని సతీష్ గౌడ్, ఎల్బాక, సర్పంచ్ నల్లగొని సరోజన రాజారాం, కొండపాక సర్పంచ్ దాట్ల వీరస్వామి హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రైతు సోదరులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో వర్ధన్యాన్ని అమ్ముకొని లాభాలు పొందాలని, దళారులను నమ్మి మోసపోవదని సూచించారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళికతో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తోకల సంపత్ రెడ్డి, మాడ కొండల్ రెడ్డి, చింతల తిరుపతిరెడ్డి, సిఐటియు హమాలి యూనియన్ జిల్లా అధ్యక్షులు పిల్లి రవి యాదవ్, నల్లగోని అభిలాష్ , రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 100% ఉత్తీర్ణత

-ప్రిన్సిపల్ ఫాతిమా బేగం

వెల్దుర్తిమండల ప్రతినిధి, ఏప్రిల్ 29 (తెలంగాణ పత్రిక):




మెదక్ జిల్లా వెల్దుర్తి కస్తూరిబా గాంధీ పాఠశాల విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో సత్తా చాటారు. బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షల్లో మొత్తం 44 మంది పరీక్షకు హాజరుకాగా 44 మంది ఉత్తీర్ణత సాధించి 100% ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ ఫాతిమా బేగం తెలిపారు. వైష్ణవి 529, కీర్తన 519, అక్షయ 518 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు.ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన విద్యకు ఈ ఫలితాలే నిదర్శనం అని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పదవ తరగతి ఫలితాలు విడుదల

-జిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదు.. రాష్ట్రస్థాయిలో 16వ స్థానం

-జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక )



జిల్లాలో 2026 పదవ తరగతి ఫలితాల్లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 14 నుండి ఏప్రిల్ 15 వరకు జరిగిన ఈ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 41 కేంద్రాల్లో మొత్తం 7,488 మంది విద్యార్థులు (బాలురు 3674, బాలికలు 3814) హాజరుకాగా, వారిలో 7,316 మంది (బాలురు 3566, బాలికలు 3750) ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 97.70 శాతం ఉత్తీర్ణత నమోదైందని, రాష్ట్ర స్థాయిలో పెద్దపల్లి జిల్లా 16వ స్థానాన్ని కైవసం చేసుకుందని ఆమె వెల్లడించారు. పదవ తరగతి ఫలితాల సాధనలో కృషి చేసిన ప్రధానోపాధ్యాయులకు, విషయ బోధన ఉపాధ్యాయులకు, పాఠశాల విద్యాశాఖ సిబ్బందికి జిల్లా విద్యాశాఖాధికారి ఈ సందర్భంగా ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## వెల్దుర్తి పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్‌కు 100% ఫలితం.. మండలంలో టాప్ స్థానాలు

-ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య

వెల్దుర్తిమండలఏప్రిల్ 29 (తెలంగాణ పత్రిక):

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ ఏడాది పాఠశాల నుంచి 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, అందరూ ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఫలితాన్ని సాధించారు. పాఠశాల చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచింది.మండల స్థాయిలో గోటిముకల అక్షయ 560 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా, శెట్టి మేఘన 556 మార్కులతో ద్వితీయ స్థానం, రాగుల లిప్సిక 553 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అలాగే 42 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించి పాఠశాలకు కీర్తి తెచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల కష్టపాటు, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల ప్రోత్సాహం కలిసి ఈ విజయాన్ని సాధించాయని తెలిపారు. ఉపాధ్యాయులు తమ అనుభవంతో విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయడం, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.
పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న ఉపాధ్యాయ బృందాన్ని, ప్రతిభ కనబరిచిన విద్యార్థులను స్థానికులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.



# మే 6న మెగా జాబ్ మేళా నిర్వహణ

-టాప్ 100 కంపెనీల పాల్గొనడం -- యువతకు విస్తృత ఉద్యోగ అవకాశాలు

-విద్యాసంస్థల సమన్వయంతో విద్యార్థుల హాజరు పెంపు

-మెగా జాబ్ మేళా నిర్వహణపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, ప్రతినిధి ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక )

పెద్దపల్లి జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించేందుకు మే 6న మెగా జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతెలిపారు.బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో మెగా జాబ్ మేల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 6న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. (రంగంపల్లి) ఆర్టీవో కార్యాలయం ఎదురుగా ఉన్న వెంకట పద్మ ఫంక్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు, ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. డీఈఈట్, టాస్క్ సమన్వయంతో సుమారు 100 ప్రముఖ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొంటాయని తెలిపారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు విద్యాసంస్థలతో సమన్వయం చేసుకుని డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాబ్ మేళా సమాచారం ప్రతి ఒక్కరికీ చేరేలా వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాను వినియోగించాలని సూచించారు. కాలేజీల పూర్వ విద్యార్థుల వివరాలను సేకరించి, నిరుద్యోగంగా ఉన్న వారికి సమాచారం చేరేలా చూడాలని, టాస్క్ లో నమోదు చేసుకున్న యువతకు కూడా సమాచారం పంపించాలని తెలిపారు. ఈ మెగా



జాబ్ మేళాను జిల్లా ఉపాధి అధికారి రాజశేఖర్ సమన్వయం చేస్తున్నారని తెలిపారు. పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ జిల్లా ఉపాధి అధికారితో సమన్వయం చేసుకుని తాగునీరు, ఇతర అవసరమైన సౌకర్యాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.మే 6న నిర్వహించనున్న ఈ జాబ్ మేళాను పెద్దపల్లి జిల్లా పరిధిలోని నిరుద్యోగ గ్రాడ్యుయేట్లు అందరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జడ్పి సీఈవో నరేందర్, డిఆర్డిఓ కాలిందిని, జిల్లా ఉపాధి కల్పనాధికారి రాజశేఖర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీతో కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కీలక సమావేశం







-అర్హులకే అక్రిడిటేషన్ కార్డులు జీఓ 252 ప్రకారం కచ్చితంగా నిబంధనలు అమలు చేయాలి

రంగారెడ్డి జిల్లా, ఏప్రిల్ 29 (తెలంగాణ పత్రిక)

రంగారెడ్డి జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం నూతనంగా ఎన్నికైన డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి కీలక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు జిల్లా కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, మీడియా వ్యవస్థ ప్రజాస్వామ్యంలో అత్యంత ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన జీఓ 252కు అనుగుణంగా నియమ నిబంధనలు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తారని కలెక్టర్ అన్నారు. అక్రిడిటేషన్ ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా కొనసాగేందుకు కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి అంశాన్ని చర్చించి ముందుకు సాగాలని, నిబంధనల అమలులో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అనంతరం డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డీపీఆర్ఓ బాలేశ్వరి, డిస్ట్రిక్ట్ మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కె. శ్రీకాంత్ రెడ్డి, శేఖర్ ఉప్పరి, సయ్యద్ ఇక్రముల్లా హుస్సైని, అన్నవరపు శేఖర్ బాబు, మహ్మద్ సిరాజ్, గంజి ప్రదీప్ కుమార్, సిహెచ్. రాంరెడ్డి, ఏం. శ్రీనివాస్, యు. శివ కుమార్, రొయ్యల రాజు, ఏఈఐఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..

# పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

ముధోల్:29ఏప్రిల్(తెలంగాణ పత్రిక)

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 100% ఉత్తీర్ణతను సాధించినట్లు మండల విద్యాధికారి గోపిడి రమణారెడ్డి బుధవారం తెలిపారు. మండల కేంద్రం లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల విద్యార్థి కె.అశ్విని 600 మార్కులకు గాను 583 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచారు. రభీంద్ర పాఠశాలకు చెందిన ఫలక్ అమనియా అక్తర్ 600 మార్కులకు గాను 579 మార్కులను సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. అష్ట ప్రభుత్వ పాఠశాలలో సిహెచ్ నవదీప్ 549, అరుణశ్రీ 522, బొరీగాం వై అర్చన 522, చించాల సమీక్ష 516, ఎడ్ బిడ్ పాఠశాలలో 548 రాథోడ్ రాహుల్, మచ్కల్ 550 ఉమా, జెడ్ పి హెచ్ ఎస్ ముధోల్ 545 ఒమేరా సిద్దిక, జడ్పీహెచ్ఎస్ బాలికల తెలుగు మీడియం ఉర్దూ మీడియం లో 553 సంజన, బుష్రా నాజ్, తరోడ ఉర్దూ మీడియం 525 అయేషా బేగం, కేజీబీవీ ముధోల్ పాఠశాలలో గాయత్రి 555, హర్షిక 552, ఆశ్రమ పాఠశాల



ముధోల్ 539 సక్రు, గురుకుల బాలుర పాఠశాలలో ఎస్ కార్తీక్ 573, మైనార్టీ ప్రెసిడెంట్ బాలికల పాఠశాలలో షేక్ ఆనమ్ ఫేర్దస్ 564, శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సాహితీ 600 మార్కులకు 540 మార్కులను సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..



విద్యార్థులు ఎంతో కష్టపడి ఉత్తమమైన మార్కులను సాధించి మండల లోనే వందశాతం ఉత్తీర్ణత సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. దీంతో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థిని, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# మల్లారెడ్డిపల్లిలో కుంభమేళను తలపించిన ప్రతిష్టాపన ఉత్సవాలు





-ఊరురా ఉప్పొంగిన ఆధ్యాత్మిక ప్రవాహం...

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక).

వీణవంక మండలం మల్లారెడ్డి పల్లి గ్రామంలో గత మూడు రోజులు సాగుతున్న శ్రీ సీతారామాంజనేయ దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం చివరి రోజున భక్తుల అధిక రద్దీతో కుంభ మేళను తలపించింది. ఊరూరా ఆధ్యాత్మికను ఉట్టిపడేలా.. శ్రీరామ స్మరణతో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాన్ని వేద బ్రాహ్మణ సహకారంతో మంత్రోత్సవాల నడుమ, అష్టదిక్పాలకులు దద్దరిల్లిలా, కోటి దేవతల పూజ అనుగ్రహంతో, గ్రామ దేవతల కటాక్షంతో, మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి సహకారంతో గ్రామంలోని సబండ వర్గాల సమక్షంలో ఎంతో వైభవంగా, దేవతమూర్తులను, నవగ్రహాలను, ధ్వజస్తంభాన్ని యంత్ర మంత్ర సాధన తో, వేద బ్రాహ్మణ అనుగ్రహ ఆశీర్వాదంతో ఎంతో వైభవంగా ప్రతిష్టించారు. ఈ ప్రతిష్టాపన ఉత్సవాల్లో సీతారాముల కళ్యాణం మహోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ ఉత్సవాల్లో గ్రామ ప్రజలు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, గ్రామంలో ఆధ్యాత్మిక ఉట్టిపడేలా, శ్రీరాముని సేవలో నిమగ్నమయ్యారు. ప్రతిష్టాపన అనంతరం భక్తులకు మహాన్నదానాన్ని ఏర్పాటు చేయగా భక్తులు స్వామివారి అన్న ప్రసాదాలను స్వీకరించారు.

# మాదిగ చర్మకారుల జిల్లా సదస్సును జయప్రదం చేయాలి.. కూసపాటి శ్రీనివాస్

భద్రాద్రి కొత్తగూడెంజిల్లా 29. ఏప్రిల్ (తెలంగాణ పత్రిక)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తెలంగాణ మాదిగ చర్మకారుల జిల్లా సదస్సును ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ సదస్సును విజయవంతం చేయడానికి జిల్లాలోని అన్ని వర్గాల చర్మకారులు, లెదర్ కార్మికులు భారీగా హాజరుకావాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. రోడ్డు పక్కన చెప్పులు కుట్టే సంప్రదాయ చర్మకారులు, లిడ్ క్యాప్ ప్రభుత్వ సంస్థ ద్వారా చెప్పుల తయారీలో నిమగ్నమై ఉన్న కార్మికులు, లెదర్ గూడ్స్ తయారీదారులు, అలాగే వివిధ శిక్షణా కార్యక్రమాల ద్వారా నైపుణ్యం పొందిన వారు అందరూ ఈ సదస్సుకు హాజరై ఐక్యతను చాటాలని కోరారు. ఈ సదస్సు సందర్భంగా కార్మికుల హక్కులు, జీవనోపాధి అభివృద్ధి, ప్రభుత్వ పథకాల అమలు, చర్మకారుల సంక్షేమంపై చర్చలు జరుగనున్నట్లు తెలిపారు. అలాగే కార్మికుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే తీర్మానాలు కూడా చేయనున్నట్లు వెల్లడించారు. ఇదే రోజున అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు. కార్మికుల ఐక్యతను ప్రతిబింబించే ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. తేది: 01-05-2026 (శుక్రవారం) సమయం: ఉదయం 10:00 గంటలకు స్థలం: సూర్యా ప్యాలెస్ సమీపంలో, భజన మందిర్ రోడ్, కొత్తగూడెం. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు, ప్రజాప్రతినిధులు, కార్మిక సంఘాల నాయకులు హాజరుకానున్నారు. సదస్సు విజయవంతం చేయడం ద్వారా చర్మకారుల ఐక్యతను మరింత బలోపేతం చేయాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. అభినందనలతో, కూసపాటి శ్రీనివాస్ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల (జేఏసీ ) దాసరి శ్రీనివాస్ (నల్ల శ్రీను) కార్పొరేటర్, 50వ డివిజన్, కొత్తగూడెం మున్సిపాలిటీ



# ప్రజలందరూ స్వీయ గణనలో పాల్గొనాలి

-కామారెడ్డి జిల్లాకలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

జనాభా గణన-2027లో భాగంగా ప్రారంభమైన "స్వీయ గణన" ప్రక్రియలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రధాన గణన అధికారి ఆశిష్ సంగ్వాన్ గురువారం సమావేశ మందిరంలో కలెక్టరేట్‌లో తన కుటుంబ వివరాలను స్వయంగా పోర్టల్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని తెలిపారు. మొదటి దశలో భాగంగా స్వీయ గణన 26-04-2026 నుండి 10-05-2026 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు తాను స్వయంగా వివరాలు నమోదు చేశానని తెలిపారు. ప్రతి పౌరుడు మొబైల్ ఫోన్ లేదా కంప్యూటర్ ద్వారా https://se.census.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి సులభంగా స్వీయ గణన పూర్తి చేయవచ్చని తెలిపారు. నమోదు అనంతరం ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ ID) వస్తుందని, దానిని భద్రపరచి ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు అందజేయాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ మే 10వ తేదీలోపు స్వీయ గణన పూర్తి చేసి జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రజలు అందించే సమాచారం పూర్తి గోప్యంగా ఉంచబడుతుందని, భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ సమాచారం కీలకమని వివరించారు.



# బదిలీపై వెళ్తున్న అధికారిణి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి కి ఘన వీడ్కోలు

-జిల్లా అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివి :

-కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి, ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



బదిలీపై వెళ్తున్న అధికారిణి శ్రీమతి డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి కి బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా యంత్రాంగం ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, డాక్టర్ కిరణ్మయి జిల్లాలో పనిచేసిన కాలంలో నిబద్ధత, అంకితభావంతో సేవలందించి ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. మహిళా శిశు సంక్షేమం, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ఆమె తీసుకున్న చొరవ జిల్లా అభివృద్ధికి దోహదపడిందన్నారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని సత్వర పరిష్కారానికి కృషి చేయడం, పారదర్శక పాలనకు కట్టుబడి పనిచేయడం ఆమె ప్రత్యేకత అని కలెక్టర్ పేర్కొన్నారు. యువ అధికారులకు ఆమె పనితీరు ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి మాట్లాడుతూ, ఇది తనకు శిక్షణ కాలమని, జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గారి మార్గదర్శకత్వంలో అనేక అంశాలు నేర్చుకున్నానని తెలిపారు. కలెక్టర్ సలహాలు, సూచనలు, ప్రోత్సాహం తన వృత్తి అభివృద్ధికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు. జిల్లా అధికారులు, రెవెన్యూ సిబ్బంది, ముఖ్యంగా బాన్సువాడ ప్రజలు అందించిన సహకారం మరువలేనిదని పేర్కొంటూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మదు మోహన్, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొని డాక్టర్ కిరణ్మయి గారిని సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

# పదిలో మెరిసిన పల్లె ఆణిముత్యాలు

-ప్రథమ, ద్వితీయ నిలిచిన చల్లూరు హైస్కూల్..

-తృతీయ స్థానంలో నిలిచిన ఎల్బాక హైస్కూల్..

-విద్యార్థులను అభినందించిన విద్యాధికారిణి శోభారాణి..

వీణవంక ప్రతినిధి, ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక).



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పది ఫలితాలలో చల్లూరు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థులు ఈ విష్ణు (575 ) మార్కులతో ప్రథమ స్థానంలో నిలువగా, కే సాత్విక ( 561) మార్కులతో రెండో స్థానంలో నిలువగా, ఎలుబాక జెడ్ పి హెచ్ ఎస్ విద్యార్థిని పి సింధు ( 559) మార్కులతో తృతీయ స్థానంలో నిలిచి, పదిలో పల్లె ముత్యాలు ప్రభుత్వ పాఠశాలలో విజయ దుందుభిని మోగించారు. వీణవంక మండల పరిధిలోని గన్ముకుల మోడల్ స్కూల్, కేజీబీవీ, జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలైన గంగారం, ఎల్బాక, మామిడాలపల్లి, పోతిరెడ్డిపల్లి, ఘన్ముక్ల, బేతిగల్, వీణవంక పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు 266 విద్యార్థులకు గాను,265 మంది విద్యార్థులు పదో తరగతిలో ఉత్తీర్లయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి అద్భుత ప్రతిభ కనబరిచిన చల్లూరు, ఎల్బాక, మోడల్ స్కూల్, కేజీబీవీ, వీణవంక విద్యార్థులకు మండల విద్యాధికారిణి శోభారాణి పూలగుచ్ఛం అందజేస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

-మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన

-సిఐ సంతోష్

ఆత్మకూర్: ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక):



ఆత్మకూరు మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ 99 రోజుల కార్యాచరణలో భాగంగా మత్తు పదార్థాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు సీఐ ఆర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతకు మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి, వాటికి దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి వంటి మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం, కుటుంబాలు నష్టపోతాయని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం గమనిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పిలుపునిచ్చారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యువతతో క్రీడలు నిర్వహించి క్రీడాసామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్ , తిరుపతి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విధి వక్రీకించిన... సంకల్పబలంతో ముందుకు వెళుతున్న దివ్యాంగులు

-దివ్యాంగుల భవిత కేంద్రాన్ని పరిశీలించిన

-స్పెషల్ ఆఫీసర్ వెంకటయ్య




మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29

చిన్నశంకరంపేట మండల కేంద్రంలో నీ ప్రాథమిక పాఠశాలలో ఉన్న దివ్యాంగుల భవిత కేంద్రాన్ని మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటయ్య బుధవారం సందర్శించారు. భవిత సెంటర్లో ర్యాంప్ పెయింటింగ్ పనులను పరిశీలించారు భవిత కేంద్రంలోని దివ్యాంగుల సంఖ్య, ఈ కేంద్రాలకు వస్తున్న తీరు, బోధనతోపాటు ఫిజియోథెరపీ వంటి కార్యక్రమాలు ప్రతిరోజు జరుగుతున్నాయ లేదా అని భవిత ఇంచార్జ్ రత్నకు అడిగి తెలుసుకున్నారు. వారికి కనీసం అవసరాలు ఉన్నాయా! ఇక్కడి వసతులు ఏమిటి? అని తెలుసుకున్నారు. వేసవికాలం దృశ్య విద్యార్థులను బయటకి తిరగనీయవద్దని తెలిపారు. దివ్యాంగులకు భరోసా కింద వారికి కావలసిన సమస్యలు పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. వీరితో పాటు ఎంపీడీవో దామోదర్, ఉన్నారు.

# అడిగిన ప్రతి పేదవానికి ఇల్లు ప్రభుత్వ లక్ష్యం

-సీనియర్ కాంగ్రెస్ నాయకులు అబ్రబోయిన స్వామి

కామారెడ్డి ,ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)



అడిగిన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు కట్టించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కామారెడ్డి జిల్లా దోమకొండ మండల సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అబ్రబోయిన స్వామి మండల అధ్యక్షుడు అనంతరెడ్డి లు అన్నారు. బుధవారం దోమకొండ మండలం ముత్యంపేట్ గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద నిర్మించుకొని గృహప్రవేశాలు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు వస్త్రాలు అందజేశారు. మే నెలలో ప్రభుత్వం ఈ పథకం కింద మరిన్ని ఇండ్లు మంజూరు ఇస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ ముత్యంపేట్ సర్పంచ్ ఆశ బోయిన అక్షర శ్రీనివాస్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపాల్ రెడ్డి చాముండేశ్వరిఆలయ కమిటీ చైర్మన్ సిద్ధారెడ్డి నాయకులు రమేష్ బాల్ రెడ్డి గంగమని తదితరులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో మండల టాపర్ గా ఆదర్శ హై స్కూల్ విద్యార్థి

మంగపేట, ఏప్రిల్ 29( తెలంగాణ పత్రిక )



రాష్ట్ర వ్యాప్తంగా ప్రకటించిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో మంగపేట మండలంలోని కమలాపురం ఆదర్శ హై స్కూల్ కు చెందిన సి హెచ్. సాత్విక్ చరణ్ కు 600 మార్కులకు గాను 575 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచాడు. మొత్తం 42 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో 26 మంది విద్యార్థులకు 500 పైగా మార్కులు వచ్చాయని వంద శాతం ఉత్తీర్ణత సాధించమని అదర్శ హై స్కూల్ కరస్పాండెంట్ వల్లూరిపల్లి ప్రసాద్ తెలిపారు.అలాగే ప్రభుత్వ పాఠశాల విభాగం లో రాజుపేట పిఎం శ్రీ హై స్కూల్ లో మండల టాపర్ గా బొంగు గౌరీ ప్రియ 574 మార్కులు సాధించారు.

## ఆర్థిక అవగాహన కార్యక్రమం



మెదక్ జిల్లా చిన్న శంకరంపేట (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29

చిన్నశంకరంపేట:ప్రతి ఒక్కరికి సమాజంలో చదువు ఎంతో ఉపయోగమని ఆర్థిక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు స్థానికసర్పంచ్ కంజర్ల చంద్రశేఖర్ తెలిపారు బుధవారం మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాలపట్ల అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ అంజమ్మ, ఏఎస్ఐ విటల్, అంగన్వాడి కార్యకర్తలు మేడి మాలతీ, వార్డు సభ్యులు కే. ప్రమీల,పాల్గొన్నారు.

## గురుకులంలో మెరిసిన మండల విద్యార్థిని అమూల్య

తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29.



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం,సీతారాంపురం పంచాయతీ పరిధిలోని పెంటన్నగూడెం గ్రామానికి చెందిన గుమాసు అమూల్య పదో తరగతి పరీక్షల్లో 544 మార్కులు సాధించి ప్రతిభ చాటింది. టి.జి.ఎస్.డబ్ల్యు.ఆర్.ఎస్ (జి) పాఠశాల పాల్వంచలో చదువుతున్న ఈ విద్యార్థిని పేదరికం జయించి, తల్లిదండ్రుల నమ్మకాన్ని మంచి ఫలితాల సాధనతో గ్రామ ప్రజలను, కుటుంబ సభ్యులను ఆనందపరిచింది. మండల ప్రజల అందరి ప్రశంసలు అందుకుంటోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివినా ప్రతిభకు అడ్డులేధని నిరూపించడమే కాకుండా, కష్టపడి చదివితే ప్రభుత్వ పాఠశాలల్లో కూడా అద్భుత ఫలితాలు సాధించవచ్చని అమూల్య సాధించి నిలిచింది .క్రమశిక్షణ -- పట్టుదలే విజయానికి మూలం పట్టుదల, ఓపిక, క్రమశిక్షణతో చదివి మంచి మార్కులు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఫలించింది.అమూల్య తల్లిదండ్రులు గుమాస్ వెంకటేశ్వర్లు, కళావతి తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివించడంతో ఈ విజయాన్ని అందుకుందని తెలిపారు. గురువులు, సహచర విద్యార్థులు, బంధువులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు అమూల్యను అభినందిస్తూ ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అమూల్య ఉన్నత విద్య కొనసాగించేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇవ్వాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలో చదివిన అమూల్య సాధించిన ఈ విజయం మండల విద్యార్థులకు ప్రేరణాత్మకంగా నిలిచింది.

## కామారెడ్డి మున్సిపల్ లో టౌన్ ప్లానింగ్ అధికారి సంతకం"ఫోర్జరీ

కామారెడ్డి , ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు ఇల్చిపూర్ శివారులో గల ఓపెన్ స్థలంలో ధ్యాన యోగ మందిరం నిర్మాణానికి అవసరమైన అనుమతి పత్రం (ఎన్ ఓసీ) కోసం ఓ వ్యక్తి టౌన్ ప్లానింగ్ అధికారి సంతకం ఫోర్జరీ చేసి బిల్లు సృష్టించిన కేసులో వింతలు, విశేషాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి సంతకం ఫోర్జరీ కేసులో ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తున్నాయి. రిమాండ్ లో ఉన్న ఫోర్జరీ కేసు నిందితుడి ఇంటిలో మరేవైనా దస్త్రాలు లభిస్తాయేమోనని పోలీసులు విచారణ జరుపుతుండగా వారి విచారణలో దొరకకుండా ఉండేందుకు నిందితుని భార్య, అతని స్నేహితుడు కొత్త పన్నాగానికి శ్రీకారం చుట్టారు. నిందితుని ఇంట్లో దాచిన ఫోర్జరీ పత్రాలు, స్టాంపులు పోలీసుల కళ్లుగప్పి దహనం చేసినట్టుగా తెలుస్తోంది. విచారణకు వచ్చిన పోలీసుల కంట పడకుండా నిందితుని భార్య పకడ్బందీ వ్యూహం అమలు చేసిందన్న టాక్ వినిపిస్తోంది.ఫోర్జరీ కేసు నిందితుడి కేసులో పోలీసులకు మరిన్ని ఆధారాలు లభించేనా అని పలువురు బాధితులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి నుంచి మొదలుకొని బ్యాంకు మేనేజర్లు, ఇండస్ట్రియల్ అధికారులు, మున్సిపల్, రెవెన్యూ తో పాటు మండల పరిషత్ అధికారుల సంతకాలు కూడా ఫోర్జరీ చేసి పలు రికార్డులు తయారు చేసి లబ్ధి పొందినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఇవన్నీ దస్త్రాలు పోలీసులకు లభించేనా, వారి కేసుకు బలం చేకూరేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఇప్పటికే సుమారు రెండు బెండిళ్ల వరకు దస్త్రాలను స్టాంప్ పేపర్లను బ్లాక్ చేసినట్లు తెలిసింది.

## పూర్తిగా డిజిటల్ విధానంలో జన గణ నచేపట్టడం జరుగుతుంది

-కామారెడ్డి జిల్లాకలెక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




జనగణన-2027 పూర్తిగా డిజిటల్ విధానంలో స్వీయ గణన తేదీ: 26-04-2026 నుండి 10-05-2026 వరకు నిర్వహించబడుతుంది. https://se.census.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోండి: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల భాగస్వామ్యమే జిల్లా అభివృద్ధికి పునాది. జనగణన-2027 కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ మరియు ప్రధాన గణన అధికారి ఆశిష్ సంగ్వాన్ కలెక్టర్ ఛాంబర్‌లో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మొదటి దశలో భాగంగా, స్వీయ గణన - సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఈరోజు అనగా తేది: 26-04-2026 నుండి 10-05-2026 వరకు నిర్వహించబడుతుంది. పౌరులు తమ స్వీయ గణనను అధికారిక వెబ్‌సైట్ https://se.census.gov.in ద్వారా పూర్తి చేయవచ్చు" అని పేర్కొన్నారు. "నమోదు సమయంలో ప్రతి వ్యక్తికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్య - యూనిక్ ఐ డి ఇవ్వబడుతుంది. ఈ ఐ డి ని గృహ గణన సమయంలో మీ ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్‌కు తప్పనిసరిగా ఇవ్వాలి. మొబైల్ ఫోన్, కంప్యూటర్ ద్వారా ఎవరైనా సులభంగా నమోదు చేసుకోవచ్చు" అని వివరించారు. "జిల్లా ప్రజలందరూ నిర్ణీత గడువులోపు ఈ పోర్టల్‌లో నమోదు చేసుకుని స్వీయ గణన ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని మనవి చేస్తున్నాను. మీ భాగస్వామ్యం జిల్లాలో సమర్థవంతమైన ప్రణాళిక మరియు అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది" అని కలెక్టర్ పిలుపునిచ్చారు. "సేకరించిన సమాచారం మొత్తం కచ్చితంగా గోప్యంగా ఉంచబడుతుంది. జనగణన సమాచారం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు, సంక్షేమ పథకాల అమలుకు కీలకం. కాబట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా సరైన వివరాలు నమోదు చేయాలి" అని కలెక్టర్ సూచించారు.

## ప్రపంచ కార్మిక దినోత్సవం "మేడే" ను బహుజన శ్రామిక వర్గ దినోత్సవంగా జరుపుకుందాం

-బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్

-రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యస్, సిద్దిరాములు

కామారెడ్డి, ఏప్రిల్ 29, ( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)




కామారెడ్డి జిల్లా కేంద్రం లో బిఎల్ టీయూ జిల్లా కార్యాలయం, బిఎల్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యస్, సిద్దిరాములు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ కార్మిక "మేడే" దినోత్సవాన్ని బహుజన కార్మిక ఐక్యత వారోత్సవాలుగా గ్రామ గ్రామ ఘనంగా జరుపుకుందాం1886లో అమెరికాలోని చికాగో నగరం హేమార్కట్ లో సమావేశం ఏర్పాటు చేసుకోని 8 గంటల పని దినాలు, సెలవు దినాల కోసం శాంతి యుతంగా జరుగుతున్న కార్మికుల సమావేశంపై అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడి పోలీస్ మూకలు జరిపిన కాల్పుల్లో కొంత మంది మృతిచెందారు. అనేక మంది గాయపడ్డారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన నాయకులను ఉరి తీశారు.ఆ కార్మిక పోరాట యోధుల ఆత్మబలిదానాలతో ఈరోజు ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు కనీ వేతనం కార్మిక హక్కుల సాధించబడ్డాయి. భారతదేశంలో 1884 లోనే ఆధునిక భారత సామాజిక విప్లవ నిర్మాత మహాత్మా జ్యోతి బా పూలే ఉద్యమ సహచరుడు కామ్రేడ్ నారాయణ మేఘాజీ లోఖండే మొదటిసారిగా కార్మిక హక్కుల సాధన కోసం పోరాడిన తొలి భారతీయ ట్రేడ్ యూనియన్ పితామహుడిగా కార్మికోద్యమానికి పునాదులు వేశారు కామ్రేడ్ లోఖండే. ముంబైలోని టెక్స్టైల్ మిల్లుల కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించారు.ప్రపంచ కార్మిక వర్గం ఏ హక్కుల సాధన కోసం ఉద్యమించిందో కామ్రేడ్ లోఖండే నాయకత్వంలో రెండు సంవత్సరాల ముందుగానే వారానికి ఒక రోజు సెలవు (ఆదివారం సెలవు)మధ్యాహ్నం భోజన విరామం ఇవ్వాలని, సమయానికి జీతాలు చెల్లించాలని "దీనబంధు" అనే పత్రికకు సంపదాకుడిగా ఉంటూనే.ఈ పత్రిక ద్వారా కార్మికుల సమస్యలను అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి, సమాజానికి తెలియజేశారు. ఆదివారం సెలవు కోసం బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 8 సంవత్సరాల సుదీర్ఘ ఉద్యమ ఫలితంగా ఆదివారం సెలవు సాధించిన ఘనత కామ్రేడ్ లోంఖాడేదే. అమెరికా చికాగో నగరంలోని హేమార్కట్ లో కార్మిక పోరాటానికంటే 2 సంవత్సరాల ముందే భారతదేశంలో కామ్రేడ్ నారాయణ మేఘాజీ లోఖాండే నాయకత్వంలో బొంబాయి కేంద్రంగా జరిగిన బహుజన శ్రామిక వర్గ పోరాట చరిత్రను బహుజన శ్రామిక వర్గానికి తెలియడానికి 142 సంవత్సరాలు సమయం పట్టింది.కారణం ఏమిటంటే భారతీయ చరిత్ర కారులంతా ఆధిపత్య బ్రాహ్మణులే కావడం వల్లనే.భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో బహుజన కార్మిక వర్గానికి రక్షణ చట్టాలను పొందుర్చుడానికి కారణం కామ్రేడ్ లోఖండే కార్మికోద్యమ చరిత్రనే స్ఫూర్తితోనే. భారతదేశంలో కార్మిక వర్గంలో 90% బహుజన శ్రామిక కులాలకు చెందిన వారుంటే. పెట్టుబడిదారుల్లో 90% ఆధిపత్య కులాలకు చెందిన అగ్రవర్ణ/అగ్రకుల వారున్నారు. భారత కార్మికోద్యమానికి నాయకత్వం వహించిన వారంతా 100% ఆధిపత్య కులాలకు చెందిన అగ్రవర్ణ/ అగ్రకుల వారే కావడం గమనార్హం.బహుజన కార్మిక వర్గ వ్యతిరేక విధానాలు అనుసరించడంలో. గత కాంగ్రెస్, ప్రస్తుత బిజెపి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/ అగ్రకుల పెట్టుబడిదార్ల అనుకుల ఆర్థిక చట్టాలు తెచ్చి బహుజన కార్మిక వర్గాన్ని నిలువు దోపిడి చేస్తున్నాయి.ఎందుకంటే ఆధిపత్య కులాల యాజమాన్యంలోని అగ్రవర్ణ/ అగ్రకుల పెట్టుబడిదార్ల ప్రతినిధులైన కాంగ్రెస్,బిజెపి, బీఆర్ఎస్, టిడిపి, వైసిపి లాంటి ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలు 90% బహుజనుల ఓట్ల కొనుగోలు చేసుకోవడానికి లక్షల కోట్ల రూపాయలు ఎన్నికల ఖర్చు పేరుతో, కార్మికుల శ్రమ దోపిడి నుండి కొల్లగొట్టిన నల్ల డబ్బును ఖర్చు చేసి అధికారంలోకి వచ్చిన తరువాత అంబానీ, ఆదాని లాంటి స్వదేశీ కార్పోరేట్ కంపెనీల తోపాటు వివిధ విదేశీ కార్పోరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసింది కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం. దాంట్లో భాగంగా కార్మిక వర్గ వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ ల తోపాటు రైతు వ్యతిరేక చట్టాలను నూతన విద్యుత్ చట్టాలను తెచ్చింది.తెలంగాణ రాష్ట్రంలో అసంఘటిత రంగంలో బీడీ, మున్సిపల్, గ్రామ పంచాయతీ, ట్రాన్స్పోర్ట్, భవన, ఇతర నిర్మాణ, శాఫ్అండ్ ఎస్టాబ్లిష్ మెంట్, వివిధ ప్రభుత్వ శాఖల్లో బహుజన కార్మిక వర్గం దాదాపు కోటిన్నర మంది ఉంటే, గ్రామీణ ప్రాంతాల్లో మరో 60 నుండి 70 లక్షల మంది వ్యవసాయ కార్మికులు ఉంటారు. ప్రజా ప్రభుత్వమని చెప్పే రేవంత్ రెడ్డి ప్రభుత్వం బహుజన కార్మిక వర్గానికి కనీస వేతనాలు అమలు చేయడానికి కానివ్వండి సంక్షేమానికి కానివ్వండి ఎలాంటి కృషి చేసిన దాఖలాలు లేవు. ఈ నేపథ్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే స్ఫూర్తితో బహుజన కార్మిక వర్గ దినోత్సవంగా గ్రామ గ్రామ ఘనంగా జరపాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ బి ఎల్ టి యు తెలంగాణ రాష్ట్ర పిలుపునిస్తున్నది. ఈ విలేకరుల సమావేశంలో, బిఎల్ టీయూ రాష్ట్ర నాయకులు, ప్రవీణ్, కామారెడ్డి జిల్లా నాయకురాలు, గంగ మణి తదితరులు పాల్గొన్నారు.

## శత శాతం సత్తా చాటిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

మెదక్‌జిల్లాచిన్నశంకరంపేట (తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29









చిన్నశంకరంపేట: 2025 - 26 విద్యా సంవత్సరానికి వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో తెలంగాణ ఆదర్శ పాఠశాల శంకరంపేట (రా) విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారు. పాఠశాల స్థాయితో పాటు మండల స్థాయిలో ప్రథమ స్థానం, ద్వితీయ స్థానం, తృతీయ స్థానం సాధించడం గర్వించదగిన విషయమని తెలిపారు గుండు భవ్యశ్రీ 572/600, గుండు సాహితి 572/600 శాలిపేట, ద్వితీయ స్థానం కే, వైష్ణవి 570/600, తృతీయ స్థానం బెహరా కరిష్మా 567/600, తోపాటు 99 మంది విద్యార్థులకు గాను 50 పైగా విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడమే కాకుండా గత పది సంవత్సరాల నుంచి ఆదర్శ పాఠశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వించదగిన విషయమని పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు వాణికుమారి సంతోషం వ్యక్తం చేయడమే కాకుండా విద్యార్థులందరికి అభినందనలు తెలియజేస్తూ ఉన్నతమైన స్థానానికి ఎదగాలని ఆకాంక్షించారు.

## గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు సకాలంలో రక్తం అందజేత

కామారెడ్డి ,ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన సౌమ్య (28) కి గాంధీ వైద్యశాల హైదరాబాద్ లో ఓ పాజిటివ్ రక్తం అవసరం కావడంతో వారి కుటుంబ సభ్యులు సంప్రదించడంతో వారికి కావలసిన రక్తాన్ని కాటేదాన్ చెందిన రాజు మానవతా దృక్పథంతో వెంటనే స్పందించి సకాలంలో రక్తాన్ని అందజేయడం జరిగిందని ఐ వి ఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్,రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు తెలియజేశారు. వేసవికాలం కావడం వలన వివిధ చికిత్సల నిమిత్తమై వచ్చే కావలసిన రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారికి కావాల్సిన రక్తాన్ని అందజేయడానికి ఎల్లవేళలా కామారెడ్డి రక్తదాతల సమూహం సిద్ధంగా ఉందని తెలియజేశారు. రక్తదాత రాజు మరియు సహకరించిన ఐవిఎఫ్ మల్లేష్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.



తెలంగాణ పత్రిక
గురువారం
ఏప్రిల్ 30, 2026
కరీంనగర్



# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఇల్లంతకుంట ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక

సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. అనధికారిక వ్యక్తులకు ఫోన్‌లో ఓటీపీలు, ఇతర వ్యక్తిగత సమాచారం ఇవ్వవద్దని హెచ్చరించారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా బాలల భద్రత, డ్రగ్స్ రహిత తెలంగాణ వారోత్సవాల సందర్భంగా బుధవారం ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్‌లో సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ, పోలీస్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6న సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను ప్రారంభించారని, జూన్ 12 వరకు 10 శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. గుర్తుతెలియని వ్యక్తులు బ్యాంక్, ఇతర సంస్థల నుంచి ఫోన్ చేసి ఓటీపీ అడిగితే చెప్పవద్దని, ఏపీకే ఫైల్స్ పంపి హ్యాకింగ్ చేస్తారని హెచ్చరించారు. సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 112, షి టీమ్ 87126 56425, టెలీ మానస్ 14416 నంబర్లను ఫోన్‌లో సేవ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండి చదువు, ఆటలపై దృష్టి పెట్టాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. మూడేళ్లలోపు, ఆరేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేయించి కోడిగుడ్లు, బాలామృతం, పాలు, పోషకాహారం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌బీఎస్‌కే వాహనాల ద్వారా ఎదుగుదల లోపించిన పిల్లలను వేములవాడ డీఈఐసీ ఆసుపత్రికి తరలిస్తామని తెలిపారు. ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 లేదా సమీప పోలీసులను సంప్రదించాలని సూచించారు. క్రెడిట్, డెబిట్ కార్డు యాక్టివేషన్ పేరుతో వచ్చే ఫోన్‌లకు స్పందించవద్దన్నారు. జిల్లాలో ఇప్పటివరకు డిజిటల్ అరెస్ట్ జరగలేదని స్పష్టం చేశారు. మహిళలు, యువతులు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు షేర్ చేయవద్దని, అకౌంట్‌ను ప్రైవేట్‌లో ఉంచుకోవాలని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో సీటు బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. బుధవారం నాంపల్లి వద్ద హెల్మెట్ లేకుండా ప్రయాణించిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని తెలిపారు. ట్రిపుల్ రైడింగ్ చేయవద్దని, వేసవిలో ఎండలో తిరగవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, మండల ప్రత్యేకాధికారి రామకృష్ణ, తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ, సర్పంచ్ గన్నారం వసంత తదితరులు పాల్గొన్నారు.






# విద్యార్థులకు సైబర్ క్రైమ్, డిజిటల్ భద్రతపై అవగాహన

కామారెడ్డి ,ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

సారంపల్లిలోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ నివాస డిగ్రీ కళాశాల లో ఈరోజు సైబర్ క్రైమ్ , డిజిటల్ భద్రతపై అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి అధ్యక్షతన, పోలీస్ శాఖ మరియు కామారెడ్డి జిల్లా బాలల రక్షణ విభాగశీ సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఈ సదస్సుకు జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి ప్రమీల , జిల్లా బాలల రక్షణ అధికారిణి డాక్టర్ జె. స్రవంతి సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు కీలక సూచనలు అందించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్ సైబర్ సెక్యూరిటీపై ప్రసంగిస్తూ, అపరిచితుల ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని, వ్యక్తిగత ఫోటోలు మరియు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవద్దని హెచ్చరించారు. ఆన్‌లైన్ గ్రూమింగ్, సెక్స్‌టార్షన్, సైబర్ బుల్లింగ్ వంటి నేరాల గురించి అవగాహన కల్పించారు. అలాగే, ఓటిపిలు అనుమానాస్పద లింక్‌ల ద్వారా జరిగే ఆర్థిక మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఏదైనా సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారిణి ప్రమీల మాట్లాడుతూ, విద్యార్థులు డిజిటల్ ఆకర్షణలకు లోనుకాకుండా తమ విద్యపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లా బాలల రక్షణ అధికారిణి డాక్టర్ జె. స్రవంతి , డిసిపియుసిబ్బందితో కలిసి బాలల మరియు యువత రక్షణకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలు వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస చారి గారు మాట్లాడుతూ, విద్యార్థుల భద్రత కోసం ఇటువంటి అవగాహన కార్యక్రమాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రస్తుతం డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నందున, విద్యార్థులందరికీ పాల్గొనే అవకాశం కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# ఘనంగా సాయిబాబా దేవాలయం 26 వ వార్షికోత్సవం

-ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అన్న ప్రసాద వితరణ...
-హాజరైన పలువురు ప్రముఖులు...

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఏప్రిల్ 29:

ఏటూరునాగారం మండల కేంద్రం లోని శ్రీ షిర్డీసాయి బాబా దేవాలయం యొక్క 26 వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పెండ్యాల ప్రభాకర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆనంద్ పాండే, అనుష్ పాండే దేవాలయం లో ఉదయం నుండి సాయిబాబాకి అభిషేకం, అర్చన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మావోయిస్టు అగ్రనేత బడే దామోదర్ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. అలాగే మాజీ మావోయిస్టు అగ్రనేత దామోదర్ ,పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మడుగురి నాగేశ్వరరావు లను చైర్మన్, కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం దేవాలయం చైర్మన్, కమిటీ సభ్యులు దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొని,,అన్న ప్రసాదం స్వీకరించారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అర్చకులు ఆనంద్ పాండే, అనుష్ పాండే తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇట్టి కార్యక్రమంలో చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, ఉపాధ్యక్షుడు బచ్చు సతీష్, సహాయ కార్యదర్శి గంజి రమేష్, కోశాధికారి వెంకట్రావు, కోడం ప్రశాంత్, వెంకట్ నర్సయ్య పెద్దలు బచ్చు సత్యనారాయణ,వెళగందుల మాధవ్, కడవెండి నర్సింహాచారి, చెన్న ముత్తయ్య, నూక ప్రభాకర్,కమిటీ సభ్యులు మాదరి తిరుపతి, మైనర్ బాబు, జగదీష్,మహిళా సభ్యులు సరళ, స్వప్న, సుశీల, ఆరే సమ్మక్క మణుగూరు నుండి విచ్చేసిన మహిళా సేవకులు, తదితరులు గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.







# అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి సేవా స్ఫూర్తి,వివాహ వేడుకల్లో ఆశీస్సులు

-ప్రమాద బాధితులకు అల్లం వారి ఆర్థిక సహాయం..........

పరకాల/గీసుకొండ/ ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక

గీసుగొండ ప్రాంతంలో సామాజిక సేవలో ముందుండే ప్రముఖ పారిశ్రామికవేత్త, జిల్లా నాయకులు అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి పలు కార్యక్రమాలలో పాల్గొని తన సేవా స్ఫూర్తిని మరోసారి చాటుకున్నారు. గీసుగొండ గ్రామానికి చెందిన ఉ దౌడు పద్మ-బాబు కుమార్తె బిందు , కార్తీక్ వివాహ వేడుక పి.డి.ఆర్ (ఏ.సి) గార్డెన్స్‌లో ఎంతో ఘనంగా జరిగింది. ఈ శుభసందర్భానికి హాజరైన అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి బహుమతిని అందజేసి వారి దాంపత్య జీవితం సుఖశాంతులతో నిండాలని ఆకాంక్షించారు. అదేవిధంగా యంబాడి సామ్రాజ్యం శంకర్ కుమార్తె శృతి భార్గవ్ ఎంగేజ్‌మెంట్ కార్యక్రమంలో పాల్గొని, నూతన దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఇంకా, సులిగే సుధాకర్ కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు ఆక్సిడెంట్‌కు గురైన విషయం తెలుసుకున్న అల్లం స్వప్న బాల కిషోర్ రెడ్డి వెంటనే స్పందించి, బాధితులను పరామర్శించి, వారి చికిత్స నిమిత్తం రూ. 5,000/- ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమాలలో గీసుగొండ సర్పంచ్ వీరగోని రాజ్ కుమార్ , నాయకులు మాదాసి రాంబాబు, తుప్పరి వికాస్, యాగోని రజనికాంత్, గాడుదూల బొంద్యాలు, కందికొండ రాజు, బోయ అశోక్, ఓదేలా సురేష్, పేర్ల రవి, తదితరులు పాల్గొని కార్యక్రమాలను మరింత ఘనంగా తీర్చిదిద్దారు. అల్లం బాల కిషోర్ రెడ్డి యువ సైన్యం





## గూడెం గ్రామంలో సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

-ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క

కామారెడ్డి, ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డి మండలం గూడెం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి సీతక్క ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులు గృహప్రవేశాలు నిర్వహించగా, ప్రజాప్రతినిధులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేదల గృహ కలను నెరవేర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.మహమ్మద్ అలీ షబ్బీర్ గారు మాట్లాడుతూ. గూడెం గ్రామంలో సామూహికంగా ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు జరగడం ఒక చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఫలితాలిస్తున్నాయని, ప్రతి కుటుంబానికి భద్రమైన నివాసం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, లబ్ధిదారులు సౌకర్యవంతంగా జీవించేలా అన్ని వసతులు కల్పించాలని అధికారులను సూచించారు. జిల్లా అభివృద్ధిలో ప్రజలు, అధికారులు కలిసి పనిచేస్తే కామారెడ్డి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అడునపు కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వో, అధికారులు, డిసిసి అధ్యక్షుడు మల్లికార్జున్, గూడెం శ్రీనివాస్ ఇంద్రకరణ్ రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, ఐరనీ సందీప్, గంప ప్రసాద్ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రభుత్వ కార్యాలయాల్లో ఆర్టీఐ అధికారుల వివరాలు తప్పనిసరి

ఇల్లంతకుంట ఏప్రిల్ 29 తెలంగాణ

సమాచార హక్కు చట్టం-2005 సమర్థ అమలుకు ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, అప్పిలేట్ అధికారుల వివరాలను స్పష్టంగా ప్రదర్శించడం తప్పనిసరి అని సమాచార హక్కు వికాస సమితి రాజన్న సిరిసిల్ల నియోజకవర్గ కో-ఆర్డినేటర్ మంద వంశీకృష్ణ పేర్కొన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ చట్టంలోని సెక్షన్ 4(1)(బి) ప్రకారం ప్రతి శాఖకు సంబంధించిన కీలక సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యాలయాల వద్ద సమాచార బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అధికారిక వెబ్‌సైట్లలోనూ వివరాలు ఉండాలన్నారు. కార్యాలయాల ఫోన్ నంబర్లు ప్రజలకు సులభంగా తెలిసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీఐ చట్టంపై అవగాహన తక్కువగా ఉందని, దీనిని పెంచేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ చర్యల ద్వారా ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకత పెరిగి అవినీతి తగ్గుతుందని అభిప్రాయపడ్డారు.




## ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దు
## పెట్రోల్ సరఫరా సాధారణంగా కొనసాగుతుంది

-కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక


మంగళవారం జిల్లా కలెక్టరేట్ నుండి పెట్రోల్ బంక్ యజమాన్యంతో మొబైల్ కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులను సమీక్షించారు. పెట్రోల్ కొరత అనే పుకార్లు నమ్మి ప్రజలు ఎక్కువ నిల్వలు చేయడం జరుగుతుందని, తద్వారా జిల్లాలో ఎలాంటి కొరత లేదని వారు స్పష్టం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, పెట్రోల్ సరఫరా సాధారణంగా కొనసాగుతోందని తెలిపారు. పుకార్లను నమ్మి అనవసరంగా ప్రజలు టెన్షన్ పడకూడదని, అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవడానికి ప్రయత్నించవద్దని ప్రజలకు సూచించారు. అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా నిల్వలు ఉన్నాయని, సరఫరా వ్యవస్థలో ఎలాంటి అంతరాయం లేదని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.



## 10 ఫలితల్లో జిల్లా స్థాయి ర్యాంక్ సాధించిన గజేల్వర్ సాత్విక

కోటగిరి తెలంగాణ పత్రిక ఏప్రిల్ 29.

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలం మాదాపూర్ హంగార్గ గ్రామానికి చెందిన గజేల్వర్ సాత్విక త్రివేణి విద్యాసంస్థలో చింతల్ లో పదవతరగతి వరకు చదువుకుని, జిల్లా స్థాయి మార్కులు 562/600 సాధిచడం జరిగింది. తల్లితండ్రులు గజేల్వర్ గంగామణి సంతోష్ లు ప్రైవేట్ విద్యాసంస్థలో టీచింగ్ వృత్తి లో ఉండడం వల్ల విద్యార్థినికి విద్యలో చాలామేరకు వారి ప్రోద్ బలం తోడై... విద్యార్థిని సాత్విక మంచి మార్కులు సాధించడానికి కృషి జరిగిందని సాత్విక తెలియజేస్తు... నా కృషికి అన్ని రకాలుగా శ్రమించి తొడ్పాటును అందించిన నా గురువులకు, నా తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని ఒక ప్రకటనలో తెలిపారు.



## దళారులకు అడ్డాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు

-అధిక తూకంతో రైతులను నిలువు దోపిడీ

-బిఆర్ఎస్ నేత నిమ్మల నవీన్ రెడ్డి



మాడ్గులపల్లి//నల్గొండ//ఏప్రిల్29:(తెలంగాణ పత్రిక):-

రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధన్యాన్ని కొనుగోలు చేసి గిట్టుబాటు ధర అందించడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన దాన్యం కొనుగోలు కేంద్రాలు దళారులకు అడ్డగా మారి రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని భారత రాష్ట్ర సమితి రాష్ట్ర నాయకులు నిమ్మల నవీన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మాడ్గులపల్లి మండలం సీత్యా తండా గ్రామపంచాయతీలో వేములపల్లి పిఎసిఎస్ ఆధ్వర్యం లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు దళారులకు అడ్డగా మారాయని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో బస్తాకు 40 కిలోల 700 గ్రాములు మాత్రమే తూకం వేయాల్సి ఉండగా క్షేత్రస్థాయిలో బస్తాకు 42 కిలోలు తూకం వేస్తూ గిరిజన రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. ధాన్యం కొలుగోలు కేంద్రాలలో కనీస సౌకర్యా లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని నెలల తరబడి దాన్యం పోసినప్పటికీ కాంటాలు వేయకపోవడంతో, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎగుమతి చేసేందుకు అవసరమైన లారీలు రాకపోవడంతో, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తమను ఆదుకునే దిక్కు ఎవరు లేరని రైతులుఆవేదనచెందుతున్నారన్నారు. కాంటాలు వేసి మిల్లులకు ఎగుమతి చేసిన ధాన్యాన్ని దిగుమతి చేసుకునే సమయంలో ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది మిల్లర్లు కుమ్మక్కై రైతులు నుండి బస్తాకు ఒక కేజీ ధాన్యం ఖరీదు డబ్బులను ముక్కుపిండి వసూలు చేస్తున్నారని, రైతులు గత్యంతరం లేక దిక్కుతోచని పరి స్థితులలో నగదు చెల్లించి వస్తున్నారన్నారు. రైతుల నుండి బలవంతంగా వసూలు చేస్తున్న రూపాయలు ఎవరి ఖాతాలకు వెళు తున్నాయో సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవినీతిని నిర్మూలించి, కొనుగోళ్లను వేగవంతంచేసిఎప్పటికప్పుడు మిల్లులకుఎగుమతిచేయాలని అయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో మండలంలోని రైతులతో సమీకరించి బిఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడ తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ ఉమారాణివెంకన్న,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు మాడ్గుల చుక్కయ్య, బాణావత్ సతీష్, కుమార్, మంగమ్మ, సరస్వతి, రవి, సక్రం, జబ్బార్, సంతోష్, సితారములు, కాసుల రమణ, వల్లపుదాసు చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.


## జిల్లాలో ప్రథమ స్థానం సాధించిన ఎక్సలెంట్ విద్యార్థిని

– 586 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిన కె. యశ్విత.

తెలంగాణ పత్రిక, పినపాక నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29.

మణుగూరు ,బయ్యారం ,అశ్వాపురం ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులు 2026 మార్చి ఫలితాల్లో అత్యుత్తమమైన ప్రతిభ కనబరిచి తమకు తామే సాటి అని మరోసారి నిరూపించారు. ఫలితాల్లో కె యశ్విత 586/100 మార్కులతో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచారు. జి త్రిశాంత్, డి వి ఎస్ ఎన్ రాజు 578 మార్కులతో రెండు స్థానంలో నిలిచారు. వి జస్వంత్ 577, డి షణ్ముఖ ప్రియా 575, జె ధరణి ప్రియ , ఎన్ స్పందన, 572, టీ మేఘన ,ఏ హంసిక్ 571 బి జీవన్ 570 , 50%విద్యార్థులు 500 కు పైగా మార్కులు సాధించి మెరుగైన ప్రతిభ కనబరిచి మరొకసారి తమకు తామే సాటి అని నిరూపించారు. విద్యార్థినీ విద్యార్థులు అత్యుత్తమ మార్కులతో పాఠశాలకు తల్లిదండ్రులకు గౌరవాన్ని చేకూర్చారు. ఈ సందర్భంగా ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ ఎండి యూసఫ్ షరీఫ్ , ఎండి ఖాదర్, ఎండి గబ్బర్, ముక్కు వెంకట నర్సారెడ్డి, ప్రిన్సిపల్ అంకం సురేష్, డైరెక్టర్ బండారు నరేంద్ర మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ పేరుని జిల్లాలో జయభేరి మోగించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఈ ప్రాంతానికి మంచి పేరు తీసుకొచ్చిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. తల్లిదండ్రుల సహకారం విద్యార్థుల కృషితోపాటు విద్యార్థుల పట్ల నిస్వార్థ సేవతో పనిచేసే ఉపాధ్యాయుల వల్ల ఈ విజయాలు సాధ్యమయ్యాయని అన్నారు. భవిష్యత్తులో కూడా ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ జిల్లా , రాష్ట్రస్థాయిలో ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

## వివాహ వేడుకకు హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం



గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కేంద్రంలోనీ వివాహ శు భకార్యానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు కటకం మృత్యుంజయం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు వీరి వెంట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు

# ప్రజాభిప్రాయాలను పట్టించుకోని మీడియా అస్తిత్వం ప్రశ్నార్థకం!

తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఏప్రిల్ 29:

సమాజం మాట్లాడుతుంది... మీడియా వినాలి.ప్రజలు ఎన్నోబాధలు అనుభవిస్తారు,జర్నలిస్టులు అర్థం చేసుకోవాలి.ఈ రెండు మధ్య ఉన్న అనుబంధమే నిజమైన జర్నలిజం.అయితే,ఈ అనుబంధం ఎప్పుడూ సమతుల్యంగా ఉందా? ప్రజల అభిప్రాయాలకు జర్నలిస్టులు ఎంత ప్రాధాన్యం ఇవ్వాలి? ఇవే ప్రశ్నలు నేటి మీడియా ప్రపంచంలో అత్యంత ముఖ్యమైనవి.మీడియా ప్రజల అభిప్రాయాలను గౌరవించాలా...?అవును...కానీ గుడ్డిగా మాత్రం కాదు.ప్రజల అభిప్రాయాలు సమాజం యొక్క ప్రతిబింబాలు. అవి వాస్తవాలు,అంతకు మించి అనుభవాలు ఇంకా చెప్పాలంటే, భావోద్వేగాల మిశ్రమం. ఒక జర్నలిస్టుగా వాటిని గౌరవించడం అంటే వాటిని వినడం,అర్థం చేసుకోవడం.కానీ అదే సమయంలో వాటిని విశ్లేషించడం కూడా చాలా ముఖ్యం.ప్రజలు చెప్పిన ప్రతిదీ నిజం కాదు,అలాగే మీడియా చెప్పిందే సత్యం అని కాదు.నిజం ఈ రెండింటి మధ్యలో ఉంటుంది. జర్నలిస్టులు ఏ సందర్భాల్లో ప్రజాభిప్రాయాలను గౌరవించాలి? తెలుసుకుందాం.

**-జర్నలిస్టులు ప్రజల అభిప్రాయాలను గౌరవించాల్సిన ముఖ్యమైన సందర్భాలు.**

ప్రజల సమస్యలు, బాధలు బయటపెట్టే సమయంలో ప్రభుత్వ విధానాలపై స్పందనలు సేకరించే సమయంలో స్థానిక సమస్యలు (రోడ్లు,నీరు,విద్య, వైద్యం) వంటి అంశాలపై కథనాలు తయారు చేసే సమయంలో సామాజిక అన్యాయాలు, దౌర్జన్యాలపై రిపోర్టింగ్ చేస్తున్నప్పుడు. ఈ సందర్భాల్లో ప్రజల వాణి వినిపించకపోతే, జర్నలిజం అసంపూర్ణంగా మారుతుంది.

**-ప్రస్తుతం మీడియా ఈ విలువలు పాటిస్తున్నదా?**

ఇది నిజాయితీగా చెప్పుకోవాల్సిన ప్రశ్న. ప్రస్తుతం చాలావరకు మీడియా సంస్థలు ప్రజల అభిప్రాయాలను వినే ప్రయత్నం చేస్తున్నా, వాటిని ప్రతిబింబించే విధానం మాత్రం చాలాసార్లు మారిపోతుంది. టి.ఆర్.పి,రేటింగ్స్, రాజకీయ ప్రభావాలు, వ్యాపార ప్రయోజనాలు ఇవి నిజమైన ప్రజాభిప్రాయాన్ని వక్రీకరించే పరిస్థితిని సృష్టిస్తున్నాయి.కొన్ని సందర్భాల్లో "ప్రజల అభిప్రాయం" అనే పేరుతో ఒక వర్గం భావనలను మాత్రమే చూపించడం జరుగుతోంది.ఇది జర్నలిజం లక్ష్యాన్ని దెబ్బతీస్తుంది. ప్రజాభిప్రాయాలను గౌరవించని మీడియా పరిస్థితి

**-ప్రజల మాట వినని మీడియా... క్రమంగా ప్రజల నుంచి దూరమవుతుంది.**

విశ్వసనీయత కోల్పోతుంది.వార్తలు నమ్మకం కోల్పోతాయి. మీడియా ఒక వర్గానికి మాత్రమే పరిమితమవుతుంది.చివరకు ప్రజలు ప్రత్యామ్నాయ వేదికలను ఆశ్రయిస్తారు.అప్పుడు జర్నలిజం ఒక సేవ కాదు... ఒక వ్యాపార సాధనం మాత్రమే అవుతుంది.

**-నూతన జర్నలిస్టులకు సూచనలు.**

జర్నలిజంలోకి కొత్తగా అడుగుపెడుతున్న వారికి ఈ అంశం చాలా కీలకం. అయితే వారికి కొన్ని ముఖ్యమైన సూచనలు:.వినడం నేర్చుకోండిమంచి జర్నలిస్టు ముందుగా మంచి శ్రోత కావాలి.ప్రజల మాటలో నిజం దాగి ఉంటుంది.ప్రతి అభిప్రాయాన్ని పరీక్షించండి,వినిపించినదాన్ని వెంటనే ప్రచారం చేయకండి. వాస్తవాలు, ఆధారాలు పరిశీలించండి.. పక్షపాతం విషయం లో దూరంగా ఉంచండి. మీ వ్యక్తిగత అభిప్రాయం, రాజకీయ నమ్మకాల ప్రభావం రిపోర్టింగ్‌పై పడకూడదు. సాధారణ మనిషి కోణం మర్చిపోకండి.మీ కథనం చదివే వ్యక్తి ఒక సాధారణ పౌరుడు.అతని సమస్యే మీ కథ..ప్రశ్నించడం ఆపకండి, ప్రజల అభిప్రాయం కూడా ప్రశ్నించాల్సిందే. అది జర్నలిజం బాధ్యత.

**-నిజాయితీ మీ ఆయుధం**

ప్రజల నమ్మకం ఒకసారి కోల్పోతే తిరిగి రావడం



అనేది చాలా కష్టం.అందు కే నిజాయితీతో పని చేయాలి. ప్రజాభిప్రాయం అనేది ఒక శక్తి.జర్నలిజం దానికి ప్రతిధ్వని అని ప్రతి జర్నలిస్ట్ తెలుసుకుని ఉండాలి.ఈ రెండింటి మధ్య సమతుల్యతే మంచి మీడియా లక్షణం. ఈ విషయంలో కేవలం జర్నలిస్టులు మాత్రమే కాదు. మీడియా యాజమాన్యాలు ఈ విషయాన్ని గుర్తెరిగి ఎడిటర్లచే మరియు డెస్క్ ఇంచార్జ్ లతో ప్రత్యేకంగా పనిచేయించాలి. అంతేగానీ నా మీడియా సంస్థ-నా ఇష్టం అనుకుంటే...ప్రజలు కూడా అలానే ఉంటారు. ఉండటమేంది తమకు నచ్చిన మీడియా సంస్థ వార్తలనే ఇప్పుడు ప్రజలు చూస్తున్నారు.ఇకపోతే నూతన జర్నలిస్టులు ఈ విలువలను గుండెల్లో పెట్టుకుని ముందుకు సాగితేనే, జర్నలిజం మళ్లీ సమాజానికి అద్దం పడుతుంది. గంపల శివకుమార్ సామాజిక కార్యకర్త. సీనియర్ పాత్రికేయులు యూనియన్ ములుగు జిల్లా ఉప అధ్యక్షుడు.

# పదవ తరగతి ఫలితాల్లో కామారెడ్డి జిల్లా ప్రభంజనం

**-97.47% ఉత్తీర్ణతతో రాష్ట్రంలోనే ముందంజ**

**-191 పాఠశాలల్లో 100% ఫలితాలు:**

కామారెడ్డి, ఏప్రిల్ 29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)

కామారెడ్డిజిల్లాలోమార్చి-2026లో నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో కామారెడ్డి జిల్లా 97.47% ఉత్తీర్ణతతో అద్భుత ఫలితాలు సాధించింది. గౌరవ జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచనలు, సలహాలు, నిరంతర మార్గదర్శకత్వంతో జిల్లాలోని 191 పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం విశేషం. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఉపాధ్యాయులు, ప్రధానోపా ధ్యాయులు అంకితభావంతో చేసిన కృషి, విద్యార్థుల క్రమశిక్షణ ఫలితంగా గతేడాదితో పోలిస్తే 2.82% ఉత్తీర్ణత శాతం పెరిగింది. జిల్లా స్థాయి టాపర్స్: ఎస్.పి.ఆర్ పాఠశాల విద్యార్థులు డి. సుహృత్ 590 మార్కులతో ప్రథమ స్థానం, పి. క్యూరీ 589 మార్కులతో ద్వితీయ స్థానం, బి. శ్రీ మహర్షి 587 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. లిటిల్ స్కాలర్స్ పాఠశాల విద్యార్థిని ఎం. సుదీక్ష 587 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు.ప్రభుత్వ పాఠశాలల టాపర్స్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దోమకొండ విద్యార్థిని ప్రణవి 582 మార్కులతో ప్రథమ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జంగంపల్లి విద్యార్థిని ఎం. సౌందర్య 580 మార్కులతో ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, దోమకొండ విద్యార్థిని ఎన్. భవాని 578 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల సహకారంతో ఈ ఘనత సాధ్యమైంది. 100% ఫలితాలు సాధించిన పాఠశాలల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు, మెరిట్ విద్యార్థులకు నా అభినందనలు. వచ్చే ఏడాది మరింత మెరుగైన



ఫలితాల కోసం ఇప్పటినుంచే ప్రణాళికతో ముందుకు వెళ్దాం" అని పిలుపునిచ్చారు. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ రాజు ను, ఇతర విద్యాశాఖ అధికారులను, ఉపాధ్యాయులను కలెక్టర్ అభినందించారు.

# గూడూరు మండలంలో పలు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవాలు

**-సుడిగాలి పర్యటనలతో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్**

గూడూరు ఏప్రిల్ 29. (తెలంగాణ పత్రిక)

మహబూబాబాద్ జిల్లా, బుధవారం రోజున గూడూరు మండలంలో, అదేవిధంగా పలు గ్రామాలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు , సుడిగాలి పర్యటనలతో ముఖ్య అతిథిగా మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ పాల్గొని, పలు కొనుగోలు కేంద్రాలను ప్రారంభోత్సవం చేశారు. వాటిలో ముందుగా మచ్చర్ల గ్రామపంచాయతీలోని గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గూడూరు మండలంలో, అయోధ్యాపురం ఐకెపి ల వరి ధాన్యపు కొనుగోలు కేంద్రాలను, అదేవిధంగా బొల్లెపల్లి, తీగలవేణి గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లిమిటెడ్ గూడూరు ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, తెలంగాణ రాష్ట్రంలో పండించిన వరి ధాన్యం ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, సన్నధాన్యానికి క్వింటాకు మద్దతు ధర 2389 రూపాయలతో పాటుగా, 500 రూపాయల బోనస్ ను కూడా చెల్లిస్తుందని తెలిపారు. సన్న వడ్లతో పాటుగా, దొడ్డు వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే ప్రతి వరిగింజను కొంటుందని, క్వింటాకు మద్దతు ధర 2369 రూపాయలు చెల్లిస్తుందని, ఈ దొడ్డు ధాన్యానికి మాత్రం క్వింటాకు 500 రూపాయల బోనస్ వర్తించదని అన్నారు. దొడ్డు వరిధాన్యం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందనవసరం లేదని రైతులకు భరోసాను కల్పించారు. అదేవిధంగా ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద అధికారులు అరేవు సీరియల్ లిస్టును వాడే విధంగా చర్యలు చేపట్టాలని, 17 శాతం కంటే మ్యాచర్ దిగువన ఉన్న రైతుల వరి ధాన్యాన్ని త్వరితగతిన క్వాంటాలు పూర్తయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, పైరవీలకు తలొగ్గొద్దని, సీరియల్ ప్రకారమే కాంటాలను పూర్తి చేయాలని, లేనియెడల వారి పైన కఠినమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. దీనిపై పూర్తి బాధ్యత గూడూరు మండల వెలుగు ఏపిఎం వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల వద్ద స్థలం చాలా తక్కువగా ఉన్నందునా, వరి పంట దిగుబడి ఎక్కువగా రావడం చేత, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రైతులు కూడా పండిన పంటను తమ తమ పొలాల వద్దనే ఆరబెట్టి, 17% కంటే దిగువ ఉన్నప్పుడే తూర్పార బట్టి, ఆ తదానంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. ఈ విధంగా రైతులు తగు జాగ్రత్తలు తీసుకోకుండా, వరి ధాన్యాన్ని కోసి సరాసరి కొనుగోలు కేంద్రంలోనే ఆరబెట్టే ప్రయత్నం చేస్తే, 17% మ్యాచ్ రావడానికి కనీసం 12, నుండి 15 రోజుల వ్యవధి పడుతుంది. దానితో మీరే కాకుండా మీ తోటి రైతులు కూడా స్థలం సరిపోక చాలా ఇబ్బందులను ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని వివరించారు. అంతేకాకుండా భారతదేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టని విధంగా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులు మధ్యదళారుల చేతిలో నష్టపోకుండా, 14% మ్యాచర్ వచ్చిన మొక్కజొన్నలను కింటాకు 2400 రూపాయలతో కొనుగోలు చేస్తుందని, రైతులు తొందరపాటు తో మధ్య దళారులకు 1600 - 1700 రూపాయలకు అమ్ముకొని మోసపు పోకూడదని హితవు పలికారు. కేవలం ప్రతి ఎకరాకు 20 క్వింటాళ్ల మొక్కజొన్నల దిగుబడి వచ్చేది.



అలాంటిది నేడు 40 క్వింటాళ్ల మొక్కజొన్న దిగుబడి రావడంతో, గోనెసంచుల లోటు ఏర్పడిందని, దీనితో ఇటు రైతులు, అటు ప్రభుత్వం కూడా ఇబ్బందులను ఎదుర్కొంటున్నదని, దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు ప్రైవేట్ వ్యక్తుల వద్ద గోనెసంచులను కొని, మొక్కలను కొనుగోలు కేంద్రాలకు తరలించాలని, రైతులు కొనుగోలు చేసినా, ప్రతి గోనె సంచి ఒక్కంటికి 15 రూపాయల చొప్పున ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతులు ఈ విధముగా చర్యలను చేపట్టడం వలన ఇటు రైతులకు, అటు ప్రభుత్వానికి కూడా కొనుగోలు సులువుతుందని, దీనితో రైతుల కష్టాలు కూడా చాలా వరకు తీరుతాయని, మహబూబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ సూచించారు. వారితోపాటు గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిట్టే వెంకన్న, కొనుగోలు కేంద్రాల మహిళ సంఘాల మహిళలు, మహిళా సంఘాల ప్రతినిధులు, అధికారులు, పలు గ్రామపంచాయతీల సర్పంచ్ లు, ఉపసర్పంచ్ లు, వ్యవసాయ అధికారులు, రైతులు, జిల్లా, మండల, పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ ప్రవేశాలు





**-ముఖ్య అతిథిగా సర్పంచ్ మల్లు గారి పద్మ తాహసిల్దార్ మారుతి రెడ్డి ఎంపీడీవో రాజేందర్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ హాజరు**

గంభీరావుపేట తెలంగాణ పత్రిక ఏప్రిల్ 29

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండల కేంద్రంలో బుధవారం రోజున పలు ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశాలకు ముఖ్య అతిథులుగా స్థానిక సర్పంచ్ మల్లు గారి పద్మా నర్సా గౌడ్ తాహసిల్దార్ మారుతి రెడ్డి ఎంపీడీవో రాజేందర్ రెడ్డి కాంగ్రెస్ మండల అధ్యక్షులు హమీద్ హాజరయ్యారు అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలు వారి యొక్క సొంతింటి కల సహకారం అవుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్కం నాంపల్లి ఏఎంసి డైరెక్టర్లు కోట లింగం ఏడబోయిన ప్రభాకర్ మాజీ సర్పంచ్ అక్కపెల్లి బాలయ్య నాయకులు మల్యాల రాజవీర్ దేశెట్టి రాజశేఖర్ వేషాల వెంకటి గొల్ల నిశాంత్ గంధ్యడపు శంకర్ నరేష్ తోపాటు వివిధ హోదాలలో ఉన్న నాయకులు కార్యకర్తలు ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత సహకారం అవసరం

**-రామాయంపేట్‌లో విద్యార్థులకు సైబర్, డ్రగ్స్‌పై అవగాహన**
**-సైబర్ నేరాల నివారణలో విద్యార్థుల పాత్ర కీలకం**
**-డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి యువత సహకారం అవసరం**
**-సైబర్, డ్రగ్స్‌పై పోరులో విద్యార్థులే ముందుండాలి**
**-మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్ ఐపీఎస్**

మెదక్ జిల్లా ప్రతినిధి (తెలంగాణ పత్రిక) 29 ఏప్రిల్

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, మెదక్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రామాయంపేట్ పట్టణ పరిధిలో విద్యార్థులకు సైబర్ నేరాలు, డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రమ్ కుమార్ సింగ్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్, డిజిటల్ లావాదేవీల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని






సూచించారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, ఈ-మెయిల్స్, లింక్‌లను నమ్మవద్దని, వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీ వంటి గోప్యమైన వివరాలను ఎవరికీ చెప్పకూడదని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. అదేవిధంగా యువతను లక్ష్యంగా చేసుకుని మత్తు పదార్థాల వ్యాప్తి పెరుగుతోందని అన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు ప్రమాదంలో పడతాయని తెలిపారు. చెడు స్నేహితుల ప్రభావానికి లోనుకాకుండా, తమ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని విద్యార్థులకు సూచించారు. సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని, తప్పుడు ప్రచారాలు, అసభ్యకర పోస్టులు, నకిలీ అకౌంట్ల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనుమానాస్పద సంఘటనలు గమనించినా, మత్తు పదార్థాల విక్రయాలపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని అన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్, రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్ఐ బాలరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# భిక్కనూరు మండలంలో పదవతరగతి ఫలితాల ప్రభంజనం

**-99.60% ఉత్తీర్ణతతో రికార్డు**

భిక్కనూరు ఏప్రిల్ 29 ( తెలంగాణ పత్రిక)

ఈ ఏడాది వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో భిక్కనూరు మండలం అద్భుతమైన ప్రతిభను కనబరిచి జిల్లాలోనే ప్రత్యేక గుర్తింపు పొందింది. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా రాణిస్తూ,అద్భుతమైన ఫలితాలను సాధించాయి. మండల వ్యాప్తంగా మొత్తం 505 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా,అందులో 502 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి సత్తా చాటారు. అంటే దాదాపు 99.60 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత ఏడాదితో పోల్చితే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరగడం విశేషం. ఇంకా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం విశేషం. ఇంకా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాలలో చదువుతున్న 9 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించడం విశేషం.

**-ప్రథమ స్థానం**

జంగంపల్లి పరిధిలోని బీసీ వెల్ఫేర్ గర్ల్స్ పాఠశాల విద్యార్థిని 588 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది.

**-ద్వితీయ స్థానం**

జడ్పీహెచ్ఎస్ జంగంపల్లి విద్యార్థి 580 మార్కులు సాధించి రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. దాదాపు మండలంలోని అన్ని పాఠశాలలు 100% ఉత్తీర్ణత సాధించడం గమనార్హం.

**-ప్రభుత్వ ప్రోత్సాహం - ఉపాధ్యాయుల కృషి:**

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయులను ఎప్పటికప్పుడు ప్రోత్సహించడం వంటి చర్యల వల్లే ఈఅసాధారణ విజయం సాధ్యమైందని ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రభుత్వ పాఠశాలలు కేవలం పేద విద్యార్థుల కోసమే కాకుండా,నాణ్యమైన విద్యకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్నాయని ఈఫలితాలు నిరూపించాయి." అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**-అధికారి పర్యవేక్షణే విజయ రహస్యం:**

మండల విద్యాధికారి రాజ్ గంగారెడ్డి నిరంతర పర్యవేక్షణ, క్షేత్రస్థాయిలో లోటుపాట్లను సరిదిద్దడం ఈ విజయానికి ప్రధాన కారణమని అటు తల్లిదండ్రులు, ఇటు ఉపాధ్యాయులు కొనియాడుతున్నారు. 99 శాతానికి పైగా ఉత్తీర్ణత




రావడంపై రాజు గంగారెడ్డి సంతోషం వ్యక్తం చేస్తూ, విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల పట్ల ఉన్న అపోహలను ఈ ఫలితాలు పటాపంచలు చేశాయి. ప్రైవేటు పాఠశాలలను మించి ఫలితాలు సాధిస్తూ, భిక్కనూరు మండలం విద్యా రంగంలో సరికొత్త చరిత్రను లిఖించింది.

# మండలంలో 183 చెరువు కుంటలకు గాను 30కుంటలకు జియో ట్యాగ్ పర్మిషన్

**-తాసిల్దార్ మాలతీ వెల్లడి.**

మెదక్ జిల్లాచిన్నశంకరంపేట(తెలంగాణ పత్రిక) ఏప్రిల్ 29

చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ అంబారెడ్డి చెరువును విట్ల్యాండ్ సర్వేలో భాగంగా మండలంలో 183 చెరువు కుంటలకు గాను 30చెరువులకు మాత్రమే జియో ట్యాగ్ పర్మిషన్ వచ్చిందని తాసిల్దార్ మాలతీ బుధవారం సర్వేలో భాగంగా ఖాజాపూర్ లో తెలిపారు.అయితే ఒక చెరువును జియో ట్యాగ్ చేస్తారని దీనికి ఎఫ్ టి ఎల్ ఫిక్స్ చేస్తారన్నారు. అందుకే వీటిలో భాగంగా అంబారెడ్డి చెరువు సర్వే చేస్తున్నామని పక్కనే గల కావేరి పరిశ్రమ వారికి చెప్పడం జరిగిందని పక్కనే ఉన్న మట్టిని వారం రోజుల్లో లేదా 15 రోజుల్లో తీసివేయండిని పరిశ్రమ యజమానికి తెలిపినట్లు సూచించారు స్పందించకపోతే నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తాసిల్దార్ మాలతీ ,ఫారెస్ట్. అధికారులు ఇరిగేషన్ ఏఈ వాసుదేవ్, రెవిన్యూ సర్వే యార్ లక్ష్మి భవాని, రెవెన్యూ ఆర్ఐలు. రాజు



వినయ్ కావేరి పరిశ్రమ యాజమాన్యం సర్పంచ్ మన్నే బాలస్వామి, ఉపసర్పంచ్ అక్బర్ ఖాజాపూర్ తాండ సర్పంచ్ పియా నాయక్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కల్వలపాలెం గ్రామంలో కిషోర బాలికల అవగాహన సదస్సు



మాడుగులపల్లి/నల్గొండ/ఏప్రిల్ 29:(తెలంగాణ పత్రిక):-

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో 99 రోజుల పాలనలో భాగంగా ఈరోజు కల్వలపాలెం గ్రామపంచాయతీ ఆవరణంలో కిశోర బాలికల అవగాహన సదస్సులో పాల్గొనడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల సునీత దానియేలు మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయకూడదు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని పిల్లల తల్లిదండ్రులు మీ యొక్క పిల్లలను మంచి చదువులు చదివించి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని మీ పిల్లల యొక్క ఆరోగ్యం పై శ్రద్ధ చూపాలని ఉన్నత చదువులు చదివి గొప్పవారు కావాలని చెప్పడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిట్యాల సునీత దానియేలు, ఉపసర్పంచ్ కేసాని ప్రభాకర్ రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు చింతకాయల సతీష్, అంగన్వాడి సూపర్వైజర్, అంగన్వాడీ టీచర్ గ్రామ సంఘం అధ్యక్షురాలు,వి ఏ ఓ గ్రామ పెద్దలు చిట్యాల ఎల్లయ్య, సురేష్ కేసన్ సంపత్ మహేష్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొనడం జరిగింది.

## ప్రైవేటు చదువులు మనకొద్దు ప్రభుత్వ చదువులే ముద్దు

**-అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలు అర్వతలేని ఉపాధ్యాయులు......**
**-కఠినమైన పరీక్షలు అర్హత ప్రమాణాలతో ఎంపికైన ప్రభుత్వ ఉపాధ్యాయులు.........**
**-ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య ఉచిత బోధన మధ్యాహ్న భోజనం............**
**-అర్హత కలిగిన ఉపాధ్యాయులు..........**
**-కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాసులు..........**
**-ప్రభుత్వ బడుల వైపు అడుగులు వేయండి**
**-గీసుగొండ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్**

పరకాల/గీసుకొండ/ ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక



గీసుగొండ గ్రామంలో విద్యా వ్యవస్థపై కీలక చర్చకు నాంది పలుకుతూ సర్పంచ్ వీరగోని రాజ్‌కుమార్ గ్రామ ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. వీడియో ద్వారా చేసిన ఈ విజ్ఞప్తిలో ప్రైవేట్ పాఠశాలలపై కట్టుదిట్టమైన నియంత్రణ చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. విద్యార్థుల భద్రత, భవిష్యత్తు దృష్ట్యా ప్రతి పాఠశాల తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించాలని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలలు, అర్హతలేని ఉపాధ్యాయులు, సురక్షితంగా లేని స్కూల్ వాహనాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇదే సమయంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న సౌకర్యాలను హైలైట్ చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచారు. ఉదయం టిఫిన్ నుంచి మధ్యాహ్న భోజనం వరకు, పరిశుభ్రమైన వాతావరణం నుంచి డిజిటల్ క్లాస్‌రూమ్స్ వరకు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రత్యేకంగా ఉపాధ్యాయుల నాణ్యతపై దృష్టి సారిస్తూ... ప్రభుత్వ పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులు సాధారణంగా నియమించబడిన వారు కాదు. వారు కఠినమైన పరీక్షలు, అర్హత ప్రమాణాలు దాటుకుని ఎంపికైన క్వాలిఫైడ్ టీచర్స్. బీఈడ్, డీఈడ్ వంటి ప్రొఫెషనల్ ట్రైనింగ్‌తో పాటు, నిరంతరం శిక్షణలు పొందుతూ ఆధునిక బోధనా పద్ధతులను అనుసరిస్తున్నారు. వారి బోధనలో కేవలం పాఠ్యాంశాల పరిమితి మాత్రమే కాదు... విద్యార్థుల ఆలోచనా శక్తి, నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందేలా మార్గనిర్దేశం ఉంటుంది. అందుకే ప్రభుత్వ బడుల్లో చదివిన విద్యార్థులు వైద్యులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, ప్రభుత్వ ఉద్యోగులు వంటి ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతున్న నేపథ్యంలో, గీసుగొండ గ్రామంలోని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ హైస్కూల్‌లో చేర్పించాలని స్పష్టంగా విజ్ఞప్తి చేశారు. మన పిల్లల భవిష్యత్తు... మనందరి బాధ్యత" అని స్పష్టం చేస్తూ, ఈ సందేశాన్ని ప్రతి ఇంటికి చేరేలా వీడియోను వీక్షించి ఇతరులతో పంచుకోవాలని కోరారు.

## పదోవ తరగతి ఫలితాల్లో దమ్మపేట మండల టాపర్ ఎం.మన్విత

**-571 మార్కులు సాధించిన నాగుపల్లి జెడ్పీహెచెస్ విద్యార్థిని**

తెలంగాణ పత్రిక/దమ్మపేట(ఏప్రిల్ 29)


ఎం.మన్విత

బుధవారం విడుదలైన పదవ తరగతి పరీక్షల ఫలితాలలో దమ్మపేట మండలంలో గల ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 277 మంది విద్యార్థులకు గాను 275 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆశ్రమ మరియు గురుకుల పాఠశాలలో మొత్తం 438 మంది విద్యార్థులకు గాను 438 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నాగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.మన్విత 571 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు వారిని ప్రోత్సహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎం.ఇ.ఓ జగపతి, నాగుపల్లి ప్రధానోపాధ్యాయురాలు కందిమళ్ళ సరళ తెలిపారు.

## మహిళల అభివృద్ధిలో కాంగ్రెస్ ముందంజలో: ఎర్రబెల్లి స్వర్ణ



**జగిత్యాల ప్రతినిధి, ఏప్రిల్ 29, (తెలంగాణ పత్రిక ):**

తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మహిళల స్థితిగతులపై స్పష్టమైన ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు రాజకీయ, ఆర్థిక రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం ఇక ఆలస్యం చేయరాని అవసరమని ఆమె స్పష్టం చేశారు. మహిళల సాధికారతే సమాజ పురోగతికి అసలైన దారిగా నిలుస్తుందని పేర్కొన్నారు. అదే సమయంలో మహిళల అభివృద్ధి, సాధికారతలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందని, మహిళలకు మరింత అవకాశాలు కల్పించే దిశగా కట్టుబడి పనిచేస్తుందని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడవాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ, అన్ని రంగాల్లో మహిళలు తమ సామర్థ్యాన్ని నిరూపిస్తున్నారని, సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే దేశ అభివృద్ధిని ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తారని దృఢంగా తెలిపారు. మహిళలను బలపరచడం అనేది సామాజిక బాధ్యతగా చూడాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్, కరీంనగర్ డీసీసీ అధ్యక్షులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కౌన్సిలర్, ఆప్షన్ మెంబర్స్, మాజీ కౌన్సిలర్ మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనిని పరిశీలించిన డి ఆర్ డి ఓ నాగ పద్మజ

**-ఉపాధి హామీలో 40 మందికి ఒక మేటును నియమించాలి......**



**నర్సంపేట/దుగ్గొండి/ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

లక్ష్మీపురం గ్రామపంచాయతీ లో ఉపాధి హామీ పథకం లో భాగంగా ఊర చెరువు పూడిక తీత పని ప్రదేశానికి డిఆర్డిఓ నాగ పద్మజ మేడం గారు విజిట్ చేయడం జరిగింది. ఇక్కడ కూలీలతో మాట్లాడడం జరిగింది వర్క్ సైడ్ ఫెసిలిటీస్ ఏ విధంగా ఉన్నాయని పరిశీలించడం జరిగింది. ఓఆర్ఎస్ ప్యాకెట్స్ పనిచేసే వారికి ఇవ్వడం జరిగింది. నీడ కొంచెం ఎక్కువగా వేయాలని సూచించడం జరిగింది. ఇంకా ఎక్కువ మంది పని కి వచ్చే విధంగా ప్రతి 40 మందికి ఒక మేటును నియమించాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లెక్కల అరుంధతి , గ్రామ సర్పంచ్ , ఏపీవో డి శ్రీనివాస్, ఈసీ బి రాజు, టిఏ మౌనిక, పంచాయతీ కార్యదర్శి కొండల్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, ఐకెపి వివో ఏలు తదితరులు పాల్గొన్నారు.

## త్రాగునీటికి దిక్కులేని పెద్ద ఆసుపత్రి - రాణా ప్రతాప్ రెడ్డి



**నర్సంపేట ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

వరంగల్ జిల్లాలో మెడికల్ కాలేజీ కి ఆస్పత్రిని 100 ల కోట్ల రూపాయలను ఖర్చు పెట్టి అభివృద్ధి చేశామని చెప్పుకునే ప్రభుత్వాలు చెప్పుకోవడానికే “కొండ నాలుకకి మందు వేస్తే ఉన్నా నాలుక పోయింది అన్నట్లు ఉంది”. రోగులకు ప్రభుత్వ ఆసుపత్రిలో త్రాగడానికి త్రాగు నీరు లేని పరిస్థితి ఇది కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి వైఫల్యం ...ఈ రోజు నర్సంపేట పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రిలో కుక్క కాటుకు గురై చికిత్స పొందుతున్న వారిని పరామర్శించడానికి వెళ్లిన సందర్భంలో అక్కడ చికిత్స పొందుతున్న వారు ఇక్కడ త్రాగడానికి కనీసం బుక్కడు మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని చెప్పడం జరిగింది..అక్కడ ఉన్న సూపర్డెంట్ ఆర్ఎంఓ తో అక్కడ ఉన్నా రోగులు పడుతున్నా ఇబ్బందులను చెప్పి ,వెంటనే సంబంధిత అధికారులు దృష్టి పెట్టి అక్కడ మంచి నీటి ఏర్పాటు చెయ్యకపోతే మేమే స్వయంగా ఏర్పాటు చేస్తామని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డ మాట్లాడారు.

# కుక్క కాటుకు గురైన వారిని పరామర్శించిన వార్డ్ కౌన్సిలర్ వేముల సంధ్య సాంబయ్య గౌడ్





**-10 లక్షల రూపాయలతో రెండు ఆర్ఓఆర్ వాటర్ ప్లాంట్లకు సాంక్షన్ వారం రోజుల్లో ఆసుపత్రిలో త్రాగునీటి సౌకర్యంలివేముల సాంబయ్య గౌడ్**

**నర్సంపేట ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

నర్సంపేట పట్టణంలోని 29వ డివిజన్ తో పాటు వివిధ డివిజన్లకు చెందిన 16 మందిని కుక్క కరవడంతో వారికి గాయాలు కావడం వల్ల నర్సంపేట జిల్లా ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఒకరికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో ఉన్న సుందరగిరి పుష్పనీలా ను కౌన్సిలర్ వేముల సంధ్య మాజీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పరామర్శించి సమస్యను అడిగి తెలుసుకున్నారు

అనంతరం ఆసుపత్రి సూపర్డెంట్ డాక్టర్ బి కిషన్ ను పిలిపించి వారి పరిస్థితిని తెలియజేసి మెరుగైన వైద్యం అందించాలని తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కుక్కకాటుకు గురైన 16 మంది రాగానే వారికి కావాల్సిన టీకాలు వ్యాక్సిన్ నాలుగు రకాలుగా అందించడం జరిగిందని 15 మందిని ఇంటికి పంపించామని ఒక పేషెంట్ కు మాత్రం తీవ్రమైన గాయాలు కావడంతో అబ్జర్వేషన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నామని తెలియజేశారు. అనంతరం తాగునీటి సమస్యపై మాట్లాడుతూ పది లక్షల రూపాయల ఆర్ఓఆర్ ప్లాంట్ సాంక్షన్ అయిందని వారం రోజుల్లోపు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు రోగులకు నాణ్యమైన త్రాగునీరు అందించడానికి చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దండెం రతన్ కుమార్, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు కటారి ఉత్తంకుమార్ పట్టణ కమిటీ సభ్యులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ 29వ డివిజన్ యూత్ నాయకులు జిజుల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# పంట సాగుపై రైతులతో శాస్త్రవేత్తలు- అవగాహన సదస్సు





**మాడుగులపల్లి/నల్గొండ/ఏప్రిల్ 29:(తెలంగాణ పత్రిక):-**

రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలు ఏప్రిల్ 27 నుండి మే 23వరకు గ్రామ స్థాయిలో రైతులకు సాగు అంశాలపై అవగాహన కల్పించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు తెలంగాణ వ్యవసాయ శాఖ సంయుక్తంగా వ్యవసాయ పరిశోధన స్థానం కంప సాగర్ ఆధ్వర్యంలో మాడుగులపల్లి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ భవనంలో రైతులకు సాగు పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.శ్రీధర్ మాట్లాడుతూ మితిమీరిన యూరియా మరియు ఎరువుల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని మార్కెట్లో గిరాకీ ఉన్న వరి రకాలను ఎంచుకొని సాగు చేయడం వల్ల అధిక ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త హిమబిందు మాట్లాడుతూ కూరగాయలు, పండ్ల సాగు, సేంద్రీయ వ్యవసాయం మరియు నీటి ఆదా గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. ఎంపీడీఓ మరియు స్థానిక సర్పంచ్ ఆరురి నరేష్ మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి ఆవలంభించి వైవిధ్యమైన పంటలు సాగుచేయాలనీ వ్యవసాయాదికారుల, శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ అధిక లాభాలు పొందాలని తెలియజేశారు. మండల వ్యవసాయ అధికారి యం.శివరాం కుమార్ ఉద్యాన అధికారి అనంత రెడ్డి, మాట్లాడుతూ వ్యవసాయ మరియు ఉద్యాన శాఖలు అందిస్తున్న రాయితీల గురించి, వివిధ కార్యక్రమాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు శిరీష, పార్వతి సంతోష, గ్రామ రైతులు మరియు ఎఫ్ పి ఓ సభ్యులు పాల్గొని రైతులకు ఈ అవగాహన కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడిందని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

# సైబర్ నేరాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి






**-మున్సిపాల్ చైర్ పర్సన్ పెండెం లక్ష్మీరామనంద్**

**నర్సంపేట ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా..ఐసిడిఎస్ మెప్మా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట మున్సిపల్ పరిధిలోని మెప్మా కార్యాలయం లో. సిడిపిఓ మధురిమ అధ్యక్షతన సైబర్ క్రైమ్, బాలల రక్షణ,యువతను మాదకద్రవ్యాల భారీ నుండి రక్షించేందుకు,యాంటీ డ్రగ్స్ నిర్మూలనకై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మీ రామానంద్ ..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ..ఆధునిక పరిజ్ఞానం కోసం వాడే సెల్ ఫోన్లు సైబర్ క్రైమ్ లకు దారితీస్తున్నాయని ప్రతి తల్లిదండ్రులు వీటిపై ఎప్పటికప్పుడు అవగాహనతో ఉండి అప్రమత్తంగా ఉండాలని,పిల్లల ప్రవర్తన పట్ల ఎలాంటి మార్పు కనిపించినా వెంటనే స్పందించి పిల్లలకి అవగాహన కల్పించాలని తెలిపారు..షీ టీం,సైబర్ క్రైమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి,కెరీర్ పై దృష్టి పెట్టాలని,మాదకద్రవ్యాలకు బానిసలైతే భవిష్యత్తు నాశనమవుతుందని తెలిపారు.గంజాయి లేదా డ్రగ్స్ విక్రయాలు,రవాణా గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడం కేవలం ప్రభుత్వం లేదా పోలీసుల బాధ్యత మాత్రమే కాదని,ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కాటన్ భాస్కర్ ..ఆధునిక టెక్నాలజీలో మంచిని మాత్రమే స్వీకరించాలని..చెడు వ్యసనాల వైపు దారి మల్లొద్దని వేసవి సెలవులను విద్యార్థులు కంప్యూటర్ శిక్షణ కోసం శరీర దారుద్యం కోసం వినియోగించు కోవాలని తెలిపారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ ముష్కె శ్రీనివాస మాట్లాడుతూ..పిల్లలు తప్పు చేస్తున్నప్పుడు ఒంటరిగా ఉండడానికి ప్రయత్నం చేస్తారని,వారి ప్రవర్తనలో కూడా మార్పులు వస్తాయని వాటిని తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. డ్రగ్స్ కు అలవాటు అయ్యే ముందు సిగరెట్లకు అలవాటు పడతారని, సిగరెట్టు అలవాటు ఉంది అనగానే తల్లిదండ్రులు అప్రమత్తం కావాలని తెలిపారు. సైబర్ క్రైమ్ అనేది ఏ రూపంలో నుండి వస్తుందో తెలియదు కావున వాటిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు..సైబర్ క్రైమ్ వలన ఫోన్లలో డబ్బులు పోయినట్లయితే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930 నంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అంగన్వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతి మాట్లాడుతూ సైబర్ క్రైమ్, డ్రగ్స్, బాలల రక్షణ సంబంధించిన అవగాహన కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లే విధంగా మహిళా సంఘాలతో కలిసి అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై గూడ అరుణ్ కుమార్, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ,షీ టీం నాగభవ్య, . శ్రావణ్ , కౌన్సిలర్స్ శ్రీ రామోజు రోజా రాణి,పొన్నాల మనీషా, వేల్పుల శ్రీలత, ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణ, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి,షీ టీం నుండి నాగభవ్య,మెప్మా సి ఎల్ ఆర్ పి సుమలత,కంప్యూటర్ ఆపరేటర్ సతీష్, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గౌర్రె రాధ, బత్తిని శిరీష, ఆర్ పి లు, అంగన్వాడీ టీచర్స్, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

# చెడు స్నేహాల వలలో పడి అనర్థాలకు గురికావద్దు

**-యువతులకు సూచించిన జిల్లా కలెక్టర్ కె. హైమావతి యువతకి**

**సిద్దిపేట జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29 (తెలంగాణ పత్రిక):**

సైబర్ క్రైమ్ , సమాచార మాధ్యమాల ద్వారా ఏర్పడిన చెడు స్నేహాల వలలో పడి అనర్థాలకు గురికావద్దని జిల్లా కలెక్టర్ కె.హైమావతి యువతకి తెలిపారు. బుదవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలలో భాగంగా నర్సింగ్ కళాశాల విద్యార్థులకు సైబర్ క్రైమ్ పైన నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రక్రియలో ఈ వారం పిల్లల భద్రత, నో డ్రగ్స్ ప్రచారం పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రతిదీ మాకు తెలుసు అనే భ్రమలో కలిగిన వయసు మీది... నిజం, అబద్ధం అనేది గ్రహించకుండా త్వరగా అట్రాక్టివ్ అవుతారని తెలిపారు. ఇంటర్నెట్, టెక్నాలజీ అవసరం మేరకు వాడుకోవాలని సూచించారు. మన ప్రజ్ఞ, విచక్షణతో ఎంత వరకు ఉపయోగించుకోవాలనే విజ్ఞతతో ప్రతి ఒక్కరికి కలిగి ఉండాలన్నారు. వాట్సప్, పలు సోషల్ మీడియాలో రకరకాల కొత్త వారితో ఎక్కువ మంది స్నేహాలు చేస్తూ ఉంటారు. అలా చెయ్యడం వలన





సమయం, చదువు, జీవితంలో చాలా అనర్థాలకు గురవుతున్నారని... చాలా మంది అక్కడక్కడ విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలు చూస్తున్నాం... దానికికారణం సోషల్ మీడియా స్నేహాలు మాత్రమే అని పేర్కొన్నారు. కుటుంబానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని... బయట ఎంత తక్కువ మంది స్నేహితులు ఉంటే జీవితం అంత ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు 20 సంవత్సరాలు పెంచారు. వారి కళలను, ఏ లక్ష్యం మేరకు చదివిస్తున్నారో ఆ లక్ష్యాన్ని చేరుకోవాలి. తల్లిదండ్రులు కళలను నెరవేర్చాలని సూచించారు. ఆధ్యాత్మిక భావన, యోగ, ద్యానం చేసుకుని పాసిటివ్ దృక్పథంలో కలిగి ఉండాలన్నారు. బయట సమాజంలో ఎలాంటి సమస్యలు ఎదురైతే ముందుగా కుటుంబ సభ్యులకు మాత్రమే తెలపాలని సూచించారు. విద్య పరంగా సమస్యలు ఎదురైతే ఉపాధ్యాయులుకు తెలపాలన్నారు. కొన్ని సమస్యలకు పరిష్కారం కాలంమే నిర్ణయిస్తుందని తెలిపారు. చదువు, పరీక్షలు, డ్యూటీ, ఫ్యామిలీ అంతే మీ ప్రపంచం... ఒక లక్ష్యాన్ని ఎంచుకుని లక్ష్య సాధనకు నిరంతరం శ్రమించి... జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆల్ ద బెస్ట్ తెలిపారు. సోషల్ మీడియా సైబర్ క్రైమ్ లో చాలా మంది లింక్స్ ఓపెన్ చెయ్యడం, చెడు పరిచయాలను దగ్గరికి రానివ్వకూడదనీ... మీ మేధస్సు మీ ఆధీనంలో ఉంచుకోవటం మీ క్షేమం కోసం అని తెలిపారు. సైబర్ క్రైమ్ మరియు డ్రగ్స్ బారిన పడకుండా జిల్లా సంక్షేమ శాఖ, పోలీస్ శాఖ తరపున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే పలుటోల్ ఫ్రీ నంబర్ ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి శారద, సీడీపీఓ రాము, ఇంచార్జ్ డిఎంఅండ్ఎచ్ఓ, వన్ టౌన్ సిఐ వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీవో



**కామారెడ్డి , ఏప్రిల్29,( తెలంగాణ పత్రిక జిల్లా ప్రతినిధి)**

కామారెడ్డి జిల్లాదోమకొండ మండలంలోని చింతామణి పల్లి గ్రామపంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల సంబంధిత ఎంపీడీవో సందర్శించడం జరిగింది ఇందులో భాగంగా కూలీలకు మౌలిక వసతులు అనగా ఎండ దెబ్బ తగలకుండా షేర్ నెట్ మరియు త్రాగునీరూ ఏర్పాటు చేయడం జరిగింది ఇందులో భాగంగా కూలీలకు కొలతల ప్రకారం ఎక్కువ మొత్తంలో కూలి పడాలని కొలతల ప్రకారం పనులు జరగాలని తెలియజేయడం జరిగింది మరియు గ్రామ పంచాయతీ సంబంధించిన నర్సరీని, అంగన్వాడి కేంద్రం నిర్మాణం దశలో ఉన్న భవనమును మరియుఇందిరమ్మ ఇళ్లను సందర్శిం చందం జరిగింది మరియు ముత్యంపేట గ్రామపంచాయతీ పరిధిలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తి అయిన వాటిని గృహప్రవేశాలు నిమిత్తం నగరం మాధురి గృహం పూర్తయినందున మండల నాయకుల ఆధ్వర్యంలో వస్త్రములు సమర్పించి గృహప్రవేశం హాజరు కావడం జరిగింది ఇట్టి కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి సంబంధి సర్పంచ్ అక్షర శ్రీనివాస్ అబ్రబోయిన స్వామి, గోపాల్ రెడ్డి, సిద్ధారెడ్డి , ఇందిరమ్మ కమిటీ సభ్యులు,గ్రామ నాయకులు పాల్గొన్నారు.

# పదవ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిన ములుగు జిల్లా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందికి శుభాకాంక్షలు

**-జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ భోర్కడే హేమంత్ సహదేవరావు,**

**తెలంగాణ పత్రిక ములుగు జిల్లా ప్రతినిది ఏప్రిల్ 29:**

ఈరోజు (29-04-2026) వెలువడిన పదవ తరగతి ఫలితాలలో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమైన విషయమని జిల్లా కలెక్టర్ మరియు మెజిస్ట్రేట్ భోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. ఈ విజయానికి కారణమైనటువంటి విద్యార్థిని విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారికి సరైన మార్గ నిర్దేశం చేస్తూ ఉత్తమ ఫలితాల సాధన కోసం కృషి చేసినటువంటి ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నానని అన్నారు. జిల్లాలో మొత్తం 3287 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 3264 మంది ఉత్తీర్ణత సాధించి 99.30 శాతంతో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి విజయకేతనం ఎగరవేయడం సంతోషకరమైన విషయం అని, రానున్న రోజులలో కూడా ఇదే ఫలితాలు పునరావృతం అయ్యేలా ప్రతి ఒక్కరు శక్తివంచన లేకుండా కృషి చేస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. జిల్లాలో ఏటూరునాగారం



మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏటూరు నాగారం విద్యార్థిని కె. కృష్ణ 589 మార్కులతో జిల్లాలో మొదటి స్థానంలో నిలవడం జరిగిందని తెలిపారు.

# నేడు జరుగు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**-ఖమ్మం కార్య నిర్వహణ సభ్యుడు కొట్టే రాజశేఖర్ పిలుపు**

**ఖమ్మం ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**



ఖమ్మం నగరం: ఖమ్మం జిల్లా తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే విధంగా ఈనెల 30వ తేదీన గురువారం నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ ఖమ్మం నందు ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించబడుతుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్య నిర్వహణ సభ్యుడు కొట్టే రాజశేఖర్ ఖమ్మం జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీలకు అతీతంగా ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కొట్టే రాజశేఖర్ ఖమ్మం జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఖమ్మం ప్రజలకు సేవే లక్ష్యంగా చలివేంద్రాలు ఏర్పాటు





**ఖమ్మం ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

ఖమ్మం నగరం: ఖమ్మం కార్పొరేషన్ లో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజలకు ఉపశమనం కల్పించే ఉద్దేశంతో ఆర్ట్ లివింగ్ ఆధ్వర్యంలో గత ఏడు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న చలివేంద్రాల కార్యక్రమం ఈ సంవత్సరం కూడా ఘనంగా ప్రారంభమైంది ఈ సందర్భంగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్ల సంయుక్త సహకారంతో ఖమ్మం నగరంలోని 24వ డివిజన్ పరిధిలో ముత్యాలమ్మ గుడి సెంటర్ మరియు బొనకలు క్రాస్ రోడ్ వద్ద చలివేంద్రం ఏర్పాటుచేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన 24వ డివిజన్ కార్పొరేటర్ తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపుమురళి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్ గౌస్, ఖమ్మం డిసిసి కార్పొరేషన్ కార్యదర్శి శ్రీనివాసరావు, సురపానేని సురేష్, గొలి రామారావు, పొలురి నాగార్జున, షేక్ లాల్ పాల్గొన్నారు. అలాగే ఆర్ట్ ఆఫ్ లివింగ్, ఖమ్మం వాలంటీర్స్ తరఫున పిల్లలమరి వెంకటేశ్వర్లు, నారాయణరావు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కమర్తపుమురళి గారు మాట్లాడుతూ, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వాలంటీర్లు నిరంతరం చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. నిర్వాహకులు మాట్లాడుతూ తీవ్ర వేడి సమయంలో ప్రజలకు చల్లని తాగునీరు, మజ్జిగ వంటి పానీయాలు అందించడం ద్వారా ఉపశమనం కల్పించడం మా ప్రధాన లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా సమాజంలో సానుకూల మార్పు తీసుకు రావడం మా ముఖ్య సంకల్పం అని నిర్వాహకులు స్పష్టం చేశారు.

# వేలేరులో సర్పంచ్ సంచలనం బేకరీకి షాక్

**-నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక**



**ఏప్రిల్ 29 స్టేషన్ ఘనపూర్ తెలంగాణ పత్రిక**

వేలేరు మండల కేంద్రంలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే సహించేది లేదంటూ వేలేరు సర్పంచ్ బిల్లా యాదగిరి హెచ్చరించారు. బుధవారం మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చికెన్, మటన్, స్వీట్, బేకరీ దుకాణాలపై మెరుపు దాడులు నిర్వహించారు. అధికారులతో కలిసి దుకాణాల్లో నాణ్యత, తూనికలు, పరిశుభ్రతను స్వయంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో చికెన్, మటన్ దుకాణాలు సక్రమంగా ఉన్నట్లు తేలగా, ఓ బేకరీ మాత్రం నిబంధనలు తుంగలో తొక్కి వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఆ బేకరీకి గ్రామపంచాయతీ భారీ జరిమానా విధించింది. ఈ సందర్భంగా సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ వ్యాపారులు నాణ్యత విషయంలో రాజీ పడొద్దు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు. షాపులను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని స్పష్టం చేశారు. ప్రజారోగ్యమే తమకు ముఖ్యమని, ఇలాంటి ఆకస్మిక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు. ఈ దాడుల్లో ఉప సర్పంచ్ శ్రీకర్, ఆరోగ్యశాఖ అధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి సంపత్ కుమార్, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు....

# యస్.బి.ఐ.టి. అధ్యాపకురాలు యన్. సవితకు డాక్టరేట్

**ఖమ్మం ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక**

ఖమ్మం నగరం: స్థానిక యస్.బి.ఐ.టి. ఇంజనీరింగ్ కళాశాల సి.యస్.ఈ. విభాగపు సహాయ ఆచార్యురాలు నటువ సవిత కు చైతన్య డీమ్డ్ టు బి విశ్వ విధ్యాలయం నుండి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ ఒక ప్రకటనలో తెలియజేశారు. “డేటా ఇంటిగ్రిటీ వెరిఫికేషన్ అండ్ హైబ్రిడ్ డీప్ లెర్నింగ్ ఎనేబుల్డ్ ఇన్‌ట్రూషన్ డిటెక్షన్ ఇన్ క్లౌడ్ కంప్యూటింగ్ ఎన్విరాన్మెంట్స్” అనే అంశం పై డా॥ ఇ. సాయికిరణ్ పర్యావేక్షణలో తను చేసిన పరిశోధనకు గాను కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం నుండి పట్టాను పొందినట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి తెలిపారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో క్లౌడ్ కంప్యూటింగ్ డేటా సెక్యూరిటీ డీప్ లెర్నింగ్ వంటి ఆధునిక టెక్నాలజీలపై పరిశోధన ద్వారా తన అనుభవం విద్యార్థులకు సి.యస్.ఈ విభాగ అభివృద్ధికి దోహద పడుతుందని కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి. రాజ్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగ నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యాజమాన్యం డా॥ ఎన్. సవితను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, డా॥ ఎ.వి.వి. శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రపంచాన్ని షేక్ చేసిన రణ్‌వీర్ 'ధురంధర్'..
# ఇప్పుడు జపాన్‌లో విడుదల

- రణ్‌వీర్ సింగ్ 'ధురంధర్' చిత్రం జపాన్‌లో విడుదలకు సిద్ధం
- జులై 10న అక్కడి థియేటర్లలోకి రానున్న సినిమా
- ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే రూ. 1328 కోట్లకు పైగా వసూళ్లు
- ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్
- నార్త్ అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాలో ఆల్ టైమ్ రికార్డులు




ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక

బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'ధురంధర్' (పార్ట్ 1) ఇప్పుడు జపాన్‌లో సందడి చేసేందుకు సిద్ధమైంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసిన ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్, జులై 10న జపాన్‌లోని థియేటర్లలో విడుదల కానుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థలైన జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్ తమ అధికారిక ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల ద్వారా ప్రకటించాయి. జపనీస్ భాషలో వివరాలతో కూడిన పోస్టర్‌ను కూడా విడుదల చేశాయి. "ఇక జపాన్ 'ధురంధర్' ఎనర్జీని చూసే సమయం వచ్చింది" అంటూ క్యాప్షన్ జోడించాయి. 2025 డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం, అప్పట్లో ఏకంగా రూ. 1328 కోట్లకు పైగా వసూళ్లు సాధించి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ సినిమా అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. నార్త్ అమెరికాలో ఆల్ టైమ్ నంబర్ 1 హిందీ చిత్రంగా నిలవడమే కాకుండా కెనడా, ఆస్ట్రేలియాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ సినిమాగా చరిత్రకెక్కింది. యూకేలో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఆదిత్య ధర్ రచన, దర్శకత్వం, నిర్మాణంలో ఈ సినిమా తెరకెక్కింది. 'ధురంధర్' రెండు భాగాలుగా వస్తున్న చిత్రం. మొదటి భాగంలో, భారతదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ను ఛేదించడానికి పాకిస్థాన్‌లోని కరాచీకి వెళ్లిన ఒక అండర్‌కవర్ భారతీయ ఇంటెలిజెన్స్ ఏజెంట్ కథను చూపించారు. దక్షిణాసియాలోని పలు వాస్తవ భౌగోళిక, రాజకీయ సంఘటనల స్ఫూర్తితో ఈ సినిమా కథను రూపొందించారు. ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్ వంటి ప్రముఖ తారలు నటించారు. ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించిన ఈ చిత్రం, జపాన్‌లో ఎలాంటి స్పందన రాబట్టుకుంటుందోనని సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

# అబ్బాయిలకు కూడా కాస్టింగ్ కౌచ్ వేధింపులు ఉంటాయి

ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక



ఇండస్ట్రీలో 'కాస్టింగ్ కౌచ్' అనేది కేవలం మహిళలకే పరిమితం కాలేదని, అబ్బాయిలు కూడా ఇలాంటి వేధింపులు ఎదుర్కొంటారని సినీ నటుడు జేడీ చక్రవర్తి కుండబద్దలు కొట్టారు. ఒకప్పుడు తాను విలన్‌గా చిన్న పాత్రలు చేస్తున్న సమయంలో, తన స్నేహితు రాలైన ఒక స్టార్ హీరోయిన్‌కు ఎదురైన చేదు అనుభవాన్ని కూడా ఆయన గుర్తు చేసుకున్నారు. ఒక సీనియర్ నిర్మాత ఆ హీరోయిన్‌తో అసభ్యంగా ప్రవర్తిస్తున్నప్పుడు... తాను, నటుడు సురేశ్ మంచం కింద దాక్కుని ఆ సంభాషణ విన్నామని చెప్పి షాక్ ఇచ్చారు. తన పెళ్లి గురించి వస్తున్న రూమర్లపై స్పందిస్తూ, తనకు తెలియకుండానే సోషల్ మీడియాలో తన పెళ్లిళ్లు జరిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. ఇక నటి మహేశ్వరితో తన అనుబంధం గురించి చెబుతూ, అప్పట్లో తామిద్దరం పెళ్లి చేసుకోవాలని అనుకున్న మాట వాస్తవమేనని, కానీ కొన్ని కారణాల వల్ల అది కుదరలేదని వివరించారు. తన గురువు రామ్ గోపాల్ వర్మ గురించి మాట్లాడుతూ, వర్మకు కోపం రాదని అందరూ అనుకుంటారని, కానీ 'సత్య' సినిమా షూటింగ్ సమయంలో ఆయన ఎమోషనల్ అయిన సందర్భాలు ఉన్నాయని సంచలన విషయాలు బయట పెట్టారు.

# రేపే థియేటర్లలోకి ధనుష్ కర



ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన కొత్త సినిమా 'కర' ఏప్రిల్ 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కాబోతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. 1991 గల్ఫ్ యుద్ధం నాటి పరిస్థితులు, దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ సినిమాను పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి U/A సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా నిడివి 2 గంటల 41 నిమిషాలుగా ఖరారైంది. తెలుగులో ఈ సినిమాను విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సీహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ కూడా ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ధనుష్ స్వయంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కర' ఒక సాధారణ వ్యక్తి అసాధారణ పరిస్థితుల్లో చిక్కుకున్న కథ అని, దర్శకుడు విఘ్నేష్ అద్భుతమైన ప్రతిభ ఉన్న వ్యక్తి అని ప్రశంసించారు. ఈ చిత్రంలో ధనుష్ సరసన మమితా బైజు హీరోయిన్‌గా నటించగా, జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. వెల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఇషారి కె. గణేష్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

# అషు రెడ్డి కేసులో ఆడియో లీక్..

ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక



నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అషు రెడ్డిపై నమోదైన చీటింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బాధితుడైన ఎన్నారై ధర్మేంద్రను అషు రెడ్డి హెచ్చరిస్తున్నట్లుగా చెబుతున్న ఓ ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. ఇదే సమయంలో, తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ అషు రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. లీకైన ఆడియో ప్రకారం.. ధర్మేంద్ర నుంచి తీసుకున్న డబ్బులో రూ.1.5 కోట్లను మే నెలలో తిరిగి ఇస్తానని, మిగిలిన మొత్తం తాను జీవితంలో స్థిరపడ్డాక చెల్లిస్తానని అషు రెడ్డి చెప్పినట్లుగా ఉంది. తన కుటుంబ సభ్యులను ఈ వివాదంలోకి లాగితే, వేధింపుల కింద ఎదురు కేసు పెడతానని హెచ్చరించినట్లు సమాచారం. నటి ప్రవీణ, జ్యోతిష్యుడు వేణు స్వామి మధ్యవర్తిత్వంలో ఈ విషయాన్ని పరిష్కరించుకుందామని కూడా ఆ ఆడియోలో ప్రస్తావించినట్లు వార్తలు వస్తున్నాయి. లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ధర్మేంద్ర అలియాస్ వెంకట్‌ను పెళ్లి చేసుకుంటానని నమ్మించి, అషు రెడ్డి 2018 నుంచి సుమారు రూ.9.35 కోట్లు, 5 కిలోల బంగారం, లగ్జరీ కార్లు, ఫ్లాట్లు తీసుకున్నారని ధర్మేంద్ర తండ్రి సత్యనారాయణ హైదరాబాద్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు అషు రెడ్డి, ఆమె కుటుంబ సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. తాజా పరిణామాలతో అషు రెడ్డి ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మరోవైపు, ఈ ఆడియో టేపుల వాస్తవికతను పోలీసులు ఇంకా ధృవీకరించలేదు. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# డూప్స్ లేకుండా మన హీరోలు ఫైట్లు చేయరు..
# 90 శాతం మంది అలాగే చేస్తున్నారు

ఏప్రిల్ 29 తెలంగాణ పత్రిక

విలక్షణ నటుడిగా, ప్రయోగాత్మక చిత్రాల దర్శకుడిగా తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవిబాబు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తన దర్శకత్వంలో రాబోతున్న కొత్త చిత్రం 'రేజర్' ప్రమోషన్ కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడుతూ.. టాలీవుడ్ స్టార్ హీరోల పనితీరు, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణపై తీవ్ర అసంతృప్తిని, ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం పెను దుమారం రేపుతున్నాయి.

### డూప్స్ లేకుండా ఫైట్ చేయరు

ఒక ఇంటర్వ్యూలో రవిబాబు మాట్లాడుతూ... "మన టాలీవుడ్ ఇండస్ట్రీలో ఉన్న హీరోలలో 90 శాతం మంది స్వయంగా ఫైట్లు చేయరు. కేవలం డూప్స్ సహాయంతోనే యాక్షన్ సన్నివేశాలను పూర్తి చేస్తారు" అంటూ బాంబు పేల్చారు. తెలుగు సినిమాల్లోని యాక్షన్ ఘట్టాలు వాస్తవికతకు ఆమడ దూరంలో ఉంటాయని, వాటిలో ఎలాంటి లాజిక్ ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. "కావలసినంత సమయం, డబ్బు ఇస్తే ఎలాంటి వెధవ అయినా ఇక్కడ సినిమా చేయగలడు" అంటూ ఘాటైన విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలు నేరుగా హీరోల సామర్థ్యాన్ని, పరిశ్రమలోని పోకడలను ప్రశ్నించేలా ఉన్నాయి.

### మిస్టరీని చంపేస్తున్న సోషల్ మీడియా

ప్రస్తుత సినిమా నిర్మాణ శైలిపైనా రవిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కారణంగా సినిమాలకు సంబంధించిన మిస్టరీ పూర్తిగా కనుమరుగైపోతోందన్నారు. "సినిమా విడుదల కాకముందే లీకులు వచ్చేస్తున్నాయి. పబ్లిసిటీ పేరుతో ప్రతి చిన్న విషయాన్ని బయటపెట్టడం వల్ల సినిమాపై ప్రేక్షకుడికి ఉండాల్సిన ఆసక్తి చచ్చిపోతోంది. ఒకప్పుడు షూటింగ్ స్పాట్‌లో నటులను చూడటమే గగనంగా ఉండేది, కానీ ఇప్పుడు అంతా బహిరంగంగా మారిపోయింది" అని ఆయన విమర్శించారు.

### 'రేజర్'లో అంతా నేచురల్




అయితే, తన తాజా చిత్రం 'రేజర్' విషయంలో పూర్తి భిన్నమైన పంథాను అనుసరించినట్లు రవిబాబు తెలిపారు. ఈ సినిమాలో ఏ ఒక్క సన్నివేశంలోనూ డూప్ ను వాడలేదని, ఫైట్ సీక్వెన్స్‌లను చాలా సహజంగా, వాస్తవికతకు దగ్గరగా చిత్రీకరించామని స్పష్టం చేశారు. తనీష్, బెనర్జీ కీలక పాత్రలలో నటించిన ఈ చిత్రాన్ని సురేశ్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మించారు. వినూత్న కథాంశంతో రాబోతున్న ఈ చిత్రం మే 8న ప్రేక్షకుల ముందుకు రానుంది. రవిబాబు వ్యాఖ్యల నేపథ్యంలో 'రేజర్'లో ఆయన చెప్పిన సహజత్వం ఎలా ఉంటుందో చూడాలని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

Editor, Printer, publisher and owned by B. VENKATESHAM, printed at RAMANI WEB OFFSET PRINTERS, H. NO. 8-82/11/1,Auto Nagar, village Bommakal, Mdl and District :Karimnagar -500001. Telangana state, published at H. NO. 9-10/7A Krishna nagar, Bommakal village Mdl and district Karimnagar 505001,Telangana state, Editor :B. VENKATESHAM Cell :8341110143